నేటి కందం- నేటికి అందం



సారస నేత్రుని దయతో
భారత దేశమున వ్యోమ ప్రాంగణమునకై
తీరుగ "ఇస్రో" సంస్థకు
ప్రేరణ గలిగించినట్టి విదుల నుతింతున్ !!

(భారత్ లో స్పేస్ స్టేషన్ ఏర్పాటు కోసం "ఇస్రో " ప్రకటన చేసింది)



-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com



చురక

అసెంబ్లీలో ఆమోదం
ఐనగాని బిల్లులు
పనిగట్టుక గవర్నర్లు
పెట్టవచ్చా చిల్లులు.
గతితప్పితే వ్యవహారం
గాడిలో పెట్టకుండాల్నా
పరిష్కరించకుండా కోర్టు
పార్లమెంటుకొదులాల్నా



-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 24-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:19 పేజీలు:6 వెల: రూ.1/-


## క్రికెట్ బ్యాట్ కోసం వచ్చి సహస్రను చంపేశాడు.. సైబరాబాద్ సీపీ వెల్లడి



హైదరాబాద్, ఆగష్టు 23: క్రికెట్ బ్యాట్‌ను దొంగిలించేందుకు వచ్చి సహస్రను చంపేసినట్లు పదో తరగతి బాలుడు అంగీకరించినట్లు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. సహస్ర హత్య కేసు విషయాలను ఇవాళ సైబరాబాద్ సీపీ మీడియాకు వెల్లడించారు.

సహస్ర తమ్ముడి బ్యాట్ బాగుందని, దాన్ని ఎలాగైనా దొంగిలించాలని పదో తరగతి బాలుడు ప్లాన్ చేసుకున్నారు. దీంతో ఓ ప్రణాళిక ప్రకారం.. ఈ నెల 18న సహస్ర పేరెంట్స్ ఇంట్లో లేని సమయంలో లోపలికి ప్రవేశించాడు. ఆ సమయంలో సహస్ర టీవీ చూస్తోంది. ఇక కిచెన్‌లో ఉన్న బ్యాట్‌ను తీసుకెళ్లేందుకు టెన్త్ విద్యార్థి మెల్లిగా అక్కడికి వెళ్లాడు. కానీ బ్యాట్ తీసుకెళ్తున్నట్లు శబ్దం రావడంతో.. అతన్ని సహస్ర గమనించి గట్టిగా కేకలు వేసింది. అతని చొక్కా పట్టుకుని నిలదీయగా.. వెంటనే బాలికను బెడ్రూమ్‌లోకి తోసేసి కత్తితో పొడిచి చంపాడు.

ఇక ఏమీ తెలియనట్లు ఇంట్లో నుంచి బయటకు వచ్చి.. దొంగచాటుగా తన ఇంటికి వెళ్లాడు. అక్కడ తండ్రి, సోదరీమణుల కంటపడకుండా మెల్లిగా బాత్రూమ్‌లోకి వెళ్లి స్నానం చేసినట్టు నటించి రక్తపు మరకలతో కూడిన బట్టలను వాషింగ్ మెషీన్‌లో వేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇక సహస్రను హత్య చేసిన రోజే అతని తల్లికి అనుమానం వచ్చింది. అదే రోజు అడిగితే తనకేమీ తెలియదని చెప్పాడు. రెండో రోజు, మూడో రోజు కూడా అడిగితే.. నువ్వే నన్ను పట్టించేటట్టు ఉన్నావని నిందితుడు తల్లిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. హత్య చేసిన తర్వాత కత్తి బయటపడేసి, టీషర్ట్ కప్పుకుని లోపలికి వెళ్లాడని, అనంతరం బాత్రూమ్‌లో స్నానం చేసి ఆ బట్టలు వాషింగ్ మిషన్‌లో వేసినట్లు వివరించారు. అయితే రెండు నెలల క్రితం నిందితుడి వద్ద ఓ మొబైల్ కనిపించిందని, ఎక్కడిది అని తల్లి అడిగితే సమాధానం చెప్పలేదని ఆమె పోలీసులకు తెలిపినట్లు పేర్కొన్నారు.

నిందితుడు సరిగ్గా పాఠశాలకు వెళ్లేవాడు కాదని, ఇంట్లోనే ఉంటూ నిత్యం ఓటీటీ క్రైమ్ సినిమాలు చూసేవాడని పేర్కొన్నారు. ఇక ఈ నెల 18వ తేదీన ఉదయం 11.30 గంటలకు కుందేల్ కూడా చనిపోయిందని, ఆ స్టోరీ కూడా నిందితుడు వివరించాడన్నారు. సహస్ర ఇంటికి నిందితుడు పలుమార్లు వెళ్లాడని, డోర్ లాక్ చేయరన్న విషయం తెలిసే ఆ రోజు దొంగతనానికి వెళ్లాడని పోలీసుల విచారణలో తేలింది.

## ఆదివారం హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, ఆగష్టు 23:: ఈ నెల 24వ తేదీన హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పోలీసులు తెలిపారు. నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. ఈ ట్రాఫిక్ ఆంక్షలు ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉండనున్నాయి. హైదరాబాద్ రన్నర్స్ మారథాన్ కార్యక్రమం కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు తెలిపారు.

పీపుల్స్ ప్లాజా, పీవీఎన్ఆర్ మార్గ్ దగ్గర రన్ ప్రారంభం కానుంది. ఖైరతాబాద్, పంజాగుట్ట, కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీదుగా గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వరకు మారథాన్ కొనసాగనుంది. ఈ క్రమంలో హుస్సేన్ సాగర్, నెక్లెస్ రోటరీ, పంజాగుట్ట, రాజ్ భవన్ రోడ్డు, జూబ్లీహిల్స్, రోడ్డు నంబర్ 45 వద్ద ట్రాఫిక్ మళ్లించనున్నారు.

పంజాగుట్ట, లిబర్టీ, ముషీరాబాద్, రాణిగంజ్, శ్రీనగర్ కాలనీ నుంచి వచ్చే వాహనాలను దారి మళ్లించనున్నారు. దీంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626కు కాల్ చేయొచ్చని పోలీసులు సూచించారు.

## మానవాళి భవిష్యత్తు కోసం అంతరిక్ష రహస్యాలను ఛేదించాలి

### - శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ ఆగష్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అంతరిక్ష శాస్త్రవేత్తలకు కొత్త ఛాలెంజ్ విసిరారు ప్రధాని మోదీ. రోదసి అన్వేషణ చేపట్టాలని ఆయన కోరారు. మానవాళి భవిష్యత్తు కోసం అంతరిక్ష రహస్యాలను ఛేదించాలని ఆయన శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సందేశం వినిపించారు. ఆయన తన సోషల్ మీడియాలో ఇవాళ ఓ వీడియోను పోస్టు చేశారు. భవిష్యత్తులో చేపట్టబోయే అంతరిక్ష ప్రయోగాల కోసం ఆస్ట్రోనాట్ల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యువత దీనిలో భాగం కావాలన్నారు. అతి సుదీర్ఘ దూరంలో ఉన్న గెలాక్సీలు, అంతరిక్షం అధ్యయనం చేయాల న్నారు. చంద్రుడి మీదకు, మార్స్ మీదకు వెళ్లామని, డీప్ స్పేస్ అంశం లో మరింత లోతుగా అన్వేషణ చేపట్టాలని, మానవాళికి ఉపయోగపడే అనేక రహస్యాలు అక్కడ ఉంటాయన్నారు.

## హైడ్రా.. ఒకటి, రెండేళ్లకు పరిమితం కాదు

### -సాంకేతిక ఆధారాలతో చెరువులను ఎఫ్ టిఎల్ మార్కు చేస్తున్నాము
### -చెరువులతో పాటు నాలాలను నోటిఫై : హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ ఆగష్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: హైడ్రాపై ప్రజలకు మరింత క్లారిటీ రావాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వలందేళ్ల ప్రణాళికతో హైడ్రా ముందుకు వెళ్తోందని అన్నారు.

బషీర్ బాగ్ లో రంగనాథ్ మీడియాతో మాట్లాడారు..ప్రస్తుతం ఆరు చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, హైడ్రా.. ఒకటి, రెండేళ్లకు పరిమితం కాదని చెప్పారు. సిఎస్ఆర్ పేరుతో చెరువులను ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారని మండిపడ్డారు. సాంకేతిక ఆధారాలతో చెరువులను ఎఫ్ టిఎల్ మార్కు చేస్తున్నామని తెలియజేశారు. చెరువుల వద్ద భూముల ధరలు కోట్లు పలుకుతున్నాయని, చెరువులతో పాటు నాలాలను నోటిఫై చేస్తున్నామని కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు.



## ఆగస్టు 25 నుంచి అమెరికాకు పోస్టల్ సేవలు నిలిపివేత: భారత్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ ఆగష్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: భారత్ కీలక నిర్ణయం తీసుకున్నది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఆగస్ట్ 25 నుంచి అమెరికాకు పోస్టల్ సేవలు నిలిపివేయనున్నది. ఈ మేరకు తపాలా శాఖ శనివారం ప్రకటించింది. అమెరికా సుంకాలకు సంబంధించిన మార్పులు ఈ నెల చివరి నుంచి అమలులోకి రానున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 25 నుంచి ఆ దేశానికి పోస్టల్ కన్సైన్‌మెంట్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పోస్టల్ డిపార్ట్‌మెంట్ శనివారం వెల్లడించింది. కాగా, అమెరికా విధించిన టారిఫ్ డ్యూటీ కలెక్షన్ ప్రక్రియపై ఇంకా స్పష్టత రాలేదు. దీంతో ఆగస్ట్ 25 తర్వాత అమెరికాకు పోస్టల్ పార్శిల్స్‌ను తీసుకెళ్లబోమని పలు విమానయాన సంస్థలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో దీనికి అనుగుణంగా ఆగస్ట్ 25 నుంచి వంద డాలర్లు వరకు విలువైన లేఖలు, పత్రాలు, బహుమతి వస్తువులు మినహా మిగతా అన్ని రకాల వస్తువుల బుకింగ్స్‌ను నిలిపివేస్తున్నట్లు పోస్టల్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. మరోవైపు ఇప్పటికే పార్శిల్‌లను బుక్ చేసుకున్న, పంపలేని కస్టమర్లు రీఫండ్ క్లెయిమ్ చేసుకోవచ్చని పోస్టల్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. 'కస్టమర్లకు కలిగిన అసౌకర్యానికి తపాలా శాఖ తీవ్రంగా చింతిస్తోంది, వీలైనంత త్వరగా అమెరికాకు పూర్తి సేవలను తిరిగి ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని అధికారిక ప్రకటనలో పేర్కొంది.

## ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం.. నీట మునిగిన నగరం..



హైదరాబాద్, ఆగష్టు 23:గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. రాజస్థాన్ రాష్ట్రంలోని సవాయ్ మాధోపూర్ నగరంలో కూడా గత కొన్ని రోజులుగా కుండపోత వర్షాలు పడుతునాన్నయి. దాంతో ఆ నగరంలోని మెజారిటీ ప్రాంతాలు నీట మునిగాయి. పలు ప్రాంతాలు తటాకాలను తలపిస్తున్నాయి.లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లు, వీధిలో నీట మునిగిపోయాయి. దాంతో అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పునరావాస కేంద్రాల్లో వారికి ఆశ్రయం కల్పించారు. అక్కడ పరిస్థితులను చక్కదిద్దేందుకు అధికారులు, విపత్తు నిర్వహణ బలగాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో రహదారులు కూడా నీట మునగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వర్షం ఇంకా పూర్తిగా తగ్గకపోవడంతో సహాయక చర్యలు అంతరాయం ఏర్పడుతోంది.

## యూరియా కొరత అధిగమించేందుకు సర్కార్ చర్యలు..!

హైదరాబాద్, ఆగష్టు 23: రాష్ట్రంలో గతకొన్ని రోజులుగా యూరియా సమస్య హాట్ టాపిక్‌గా మారింది. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడంలేదని అధికార పార్టీ ఆరోపిస్తుంటే.. మరో పక్క రాష్ట్ర బీజేపీ నేతలు అలాంటిదేమీ లేదని కొట్టిపడేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రంగంలోకి దిగారు.యూరియాను ఎప్పటికప్పుడు సరఫరా కేంద్రాలకు తరలించేలా అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

కొన్ని జిల్లాల్లో లారీ అసోసియేషన్స్ మధ్య ఏర్పడిన పోటీతో యూరియా రవాణా నిలిచిపోవడంతో.. ట్రాన్స్‌పోర్ట్ సమస్యను స్వయంగా మాట్లాడి పరిష్కరిస్తున్నారు మంత్రి తుమ్మల. రామగుండం యూరియా ఫ్యాక్టరీతోనూ మంత్రి నిరంతర సంప్రదింపులు జరుపుతున్నారు. శనివారం రామగుండం ఫ్యాక్టరీ ఎండీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలవనున్నారు. కాగా, సాంకేతిక సమస్య కారణంగా రామగుండం ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఉత్పత్తి ప్రారంభం అయితే యూరియా సమస్య కొంతైనా తీరే అవకాశం ఉందని సర్కార్ భావిస్తోంది.

## వైన్స్ టెండర్లలో అరెకటికలకు ప్రభుత్వం 30శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి

### -మంత్రి జూపల్లి కృష్ణ రావును కలిసి వినతి పత్రం సమర్పించిన అరెకటిక అభివృద్ధి సంఘం ప్రతినిధులు



హైదరాబాద్ ఆగష్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );"మటన్ వృత్తి- సారా వృత్తి జన్మత: ఐన అరెకటికలకు ప్రభుత్వం వైన్స్ టెండర్లలో 30శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని అరెకటిక అభివృద్ధి సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సచివాలయం లో సంఘం ప్రతినిధులు రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణ రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం అరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూంపల్లి అశోక్ దాదా, ఉపాధ్యక్షులు జి రమేష్, కె.వెంకటేశ్వర్ , ఎం నాగ శేష జాయింట్ సెక్రెటరీ జె.శ్రీనివాస్, ట్రెజరర్ కేడి దినేష్, కేడి గోపాల్ జి, మొదలగు వారితో కలిసి మాట్లాడారు. మాదే అయినా మాకు గత ప్రభుత్వం 2021 సం.లో నూతన ఎక్సైజ్ పాలసీలో సైతం అన్యాయం చేసింది. అప్పటి ఎక్సైజ్శాఖామంత్రి గౌజ్లకు 15%, ఎస్సీలకు 10%, ఎస్టీలకు 5% ఏ మాత్రం సంబంధంలేని వీరికి కట్టబెట్టిండు. మాకు న్యాయం చేయండని అనేక ఉద్యమాలు చేసినా, మెమోరాండాలు ఇచ్చినా మా అరెకటికలకు న్యాయం జరుగలేదు. ఏ ఒక్కటి ఇవ్వలేదు.మా సుటన్ వృత్తిపై 9 మేకల మండీలపై ప్రతియేటా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తుంది. యాభైకి పైగా ఉన్న అంగళ్ళపై కోట్లాది రూ.ల ఆదాయం వస్తుంది. ప్రభుత్వ ఖజానాకు ప్రత్యక్షంగా పరోక్షంగా మా కులవృత్తి ఆర్థిక వనరులుగా ఉపయోగపడుతుంది. అయినా ఈ 79 సం.రాల కాలంలో మా కులానికి ప్రత్యేక కార్పోరేషన్ ఏ ప్రభుత్వం ఇవ్వలేదు. మమ్మల్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు. మా అరెకటికలకు ప్రభుత్వం వెంటనే రూ.500 కోట్లతో ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని,.(3) ప్రభుత్వం బిసి-డి నుండి బిసి ఎ హోదా కల్పిస్తూ జి.ఓ. తేవాలని,.(4) ప్రభుత్వం రాష్ట్రంలోని మేకల మండిలను ఆధునికరించి అరెకటికలకు అప్పగించాలని,.(5) ఇంటిగ్రేటెడ్ మటన్ మార్కెట్లలో అరెకటికలకు పూర్తి హక్కు కల్పిస్తూ జీవో తేవాలని,.(6) మేకలు తేవడానికిపోయి వస్తున్న అరెకటికలకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ రూ.25 లక్షలు వర్తింపచేస్తూ ప్రత్యేక జిఓ తీసుకురావాలని డిమాండ్ చేసారు..

## నల్లగొండలో అట్టహాసంగా ఈశా గ్రామోత్సవం

### – క్రీడా పోటీలను ప్రారంభించిన అదనపు ఎస్పీ రమేశ్

నల్గొండ, ఆగషు 23: నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో 17వ ఈశా గ్రామోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. ఈశా ఫౌండేషన్ నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో పురుషుల వాలీబాల్‌లో 15 జట్లు, మహిళల త్రోబాల్‌లో 10 జట్లు పాల్గొన్నాయి. నల్లగొండ అదనపు ఎస్పీ జి.రమేశ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఇషా ఫౌండేషన్ వారు ప్రత్యేక గ్రామోత్సవం నిర్వహించి, గ్రామాలోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడం శుభ పరిణామం అన్నారు. ఆజూా అక్బర్ అలీ, లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ కె.సతీశ్, కేబినెట్ సెక్రెటరీ రామకృష్ణ, సెక్రెటరీ విమల, సెక్రెటరీ కవిత సెక్రెటరీ శ్రీనివాస్, ఒఉ ఖఇ సెక్రెటరీ వెంకట్ రామ్ రెడ్డి కార్యక్రమానికి హాజరై ఆటగాళ్లను ఉత్తేజ పరిచారు. పేరిణి నాట్యం, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామోత్సవం కోలాహలంగా జరిగింది.

2004లో సద్గురు ప్రారంభించిన ఈశా గ్రామోత్సవం, గ్రామీణ భారతదేశ స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయడానికి ఉద్దేశించినది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 22 జిల్లాల్లో ఈ పోటీలు నిర్వహించబడతాయి. ఆగస్టు 15 నుండి సెప్టెంబర్ 21 వరకు క్లస్టర్ (జిల్లా స్థాయి), డివిజనల్ (రాష్ట్ర స్థాయి) ఉ ఫైనల్ (దక్షిణ భారత దేశ రాష్ట్రాల పోటీ) 3 దశల్లో మ్యాచ్‌లు నిర్వహించబడతాయి. ప్రతీ స్థాయిలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు మెరిట్ సర్టిఫికెట్, నగదు బహుమానం ఉంటుంది. ఫైనల్ ఈవెంట్ ఈ ఏడాది సెప్టెంబర్ 21న ఈశా యోగా సెంటర్, కోయంబ త్తూరులో జరగనుంది. విజేత జట్లకు ఈశా రిజువినేషన్ ట్రోఫీ, ఇంకా నగదు బహుమతులు – వాలీబాల్ (పురుషులు): రూ.5 లక్షలు, త్రోబాల్ (మహిళలు): రూ.5 లక్షలు. మొత్తంగా కోటి రూపాయలకు పైగా నగదు బహుమతులు ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు.

## పసుపు పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

### -వ్యవసాయ విస్తీర్ణాధికారి ఎం. నారాయణ



ఆదిలాబాద్, ఆగష్టు 23:ఇటీవల కురిసిన వర్షాలకు పసుపు పంటలో పసుపు పంటకు దుంప కుళ్ళు, తాటాకు మచ్చ తెగులు ఆశిస్తోందని వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఎం. నారాయణ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని జంగం పార్డి (కే) తదితర గ్రామాల్లో పంటలు సాగు చేసిన వ్యవసాయ క్షేత్రాలను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు.

పసుపు పంట ఆకులపై అక్కడక్కడా పెద్ద మచ్చలు ఏర్పడడంతో పాటు ముదురు గోధుమ రంగులోని మచ్చల చుట్టూ పసుపు రంగు వలయం ఏర్పడుతుందన్నారు. రైతులు పసుపు పంటలు సస్యరక్షణ చర్యలను చేపట్టడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాల వల్ల పసుపు పంటలో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని సూచించారు. ఈ తెగుళ్ల నివారణకు మచ్చలు ఉన్న, ఎండిన ఆకులను తొలగించి కాల్చి వేయాలని పేర్కొన్నారు. లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండజిం లేదా 2.5 గ్రాముల మాంకోజెట్, 0.5 మి.లీ. సబ్బు నీరు లేదా ఒక గ్రామ్ థయోఫానేట్ మిథైల్ కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు.

ఇనుప ధాతు లోపం భూమిలో చౌడు, సున్నం, భాస్వరం ఎక్కువగా, సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్న భూముల్లో ఇనుప ధాతులోపం కనిపిస్తుందన్నారు. దీనివల్ల ఆకులు తెల్లగా మారుతాయి. ఆకు పరిమాణం తగ్గి అంచుల కణజాలం దెబ్బతింటుంది. పంట చేతికొచ్చే సమయంలో దుంపలు, కొమ్ములు చిన్నవిగా తయారై నాణ్యత లోపిస్తుందని తెలిపారు.

దీని నివారణకు మడిలో మురుగునీరు పోయే సౌకర్యం కల్పించడంతో పాటు లీటరు నీటిలో 5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ లేదా 10 గ్రాముల అన్నభేది, ఒక గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పైరుపై 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు రైతుల సోయా, పత్తి క్షేత్రాలను పరిశీలించి తగు సూచనలు సలహాలను అందజేశారు. ఆయా గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఎన్‌రోల్‌మెంట్‌ను ఆన్‌లైన్లో నమోదు చేశారు.

## ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

మహబూబ్‌నగర్, ఆగష్టు 23: బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్ నగర్ మండల యూరియా పంపిణీ కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులను కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలు కష్టాల్లో ఉన్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్ల ఇస్తే కనీసం మంచి నీళ్లు ఇవ్వడం లేదని విమర్శించారు. ఇచ్చే నీళ్లు సరిగ్గా క్లోరినేషన్ చేయడం లేదని మండిపడ్డారు. యూరియా కోసం వచ్చిన రైతుల పట్ల చులకనగా మంత్రులు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు వేదికలు కట్టిందని, కరెంటు , యూరియా, విత్తనాలు సకాలంలో ఇచ్చిందని గుర్తు చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో నెలకొన్న పరిస్థితులను మళ్లీ కాంగ్రెస్ హయాంలో చూస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రైతులను పంపిస్తు క్యూ లైన్‌లో నిలబెడుతున్నారని మంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ మంత్రి తిరిగితే తెలుస్తదని సూచించారు. అధికారం ఉంది కదా ఏది పడితే అది మాట్లాడవద్దని హితవు పలికారు.

ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద ఒక వ్యక్తి మూర్ఛ వచ్చి పడిపోయిండు. అంబులెన్సుకు ఫోన్ చేస్తే సమయానికి రాలేదు. చనిపోతే ఎవరు బాధ్యత వహించాలని ప్రశ్నించారు. రామగుండంలో ఫ్యాక్టరీ చెడిపోతే కూడా పట్టించుకో లేదని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. నాటు వేసిన 10 రోజుల్లో యూరియా వేయకుంటే దిగుబడి తగ్గుతదని, దీంతో రైతులు నష్ట పోయే ప్రమాదముందని అన్నారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ఉచితంగా యూరియా ఇవ్వాలని, యూరియా కొరతతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని కోరారు. తమ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు 90 శాతం పూర్తయ్యాయని, మిగతా పది శాతం పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇవ్వడం లేదని కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. మాజీ మంత్రి వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, హన్వాడ మాజీ ఎంపీపీ బాలరాజు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్ నగర్ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గణేష్, శ్రీనివాస్ రెడ్డి, మల్లు నర్సింహా రెడ్డి, కొండ లక్ష్మయ్య, చెన్నయ్య, జంబులయ్య, రాఘవేందర్ గౌడ్, సుధాకర్ ఉన్నారు.

# విప్లవ అగ్ని కణం : స్వాతంత్ర్య సమర యోధుడు రాజ్‌గురు

## (24 ఆగష్టు "స్వాతంత్ర్య సమరయోధుడు రాజ్‌గురు జన్మదినం" సందర్భంగా)

24 ఆగష్టు 1908న పూనె సమీప ఖేడ్ గ్రామంలోని పార్వతీదేవి – హరినారాయణ్ రాజ్‌గురు మరాఠీ బ్రాహ్మణ దంపతులకు జన్మించిన శివరామ్ హరి రాజ్‌గురు తన తండ్రిని 6వ ఏటనే కోల్పోయారు. అన్నయ్య దినకర్ కుటుంబ పెద్దగా బాధ్యతలు చేపట్టడంతో ప్రాథమిక విద్యను ఖేడ్‌లో, ఉన్నత పాఠశాల విద్యను పూనె న్యూ ఇంగ్లీష్ హైస్కూల్‌లో పూర్తి చేశారు. చిన్నతనంలోనే బ్రిటీష్ అప్రజాస్వామిక పాలనను వ్యతిరేకిస్తూ సేవ దళ్‌లో చేరి తన నిస్వార్థ సేవా యాత్రను ప్రారంభించారు. చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్లు కలిసి ఏర్పాటు చేసిన "హిందుస్థానీ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్"లో చురుకైన సభ్యుడిగా చేరి బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. మంచి షూటర్‌గా అనుభవం కలిగి ఉండటంతో ఆయనను అందరూ 'గన్‌మెన్' అని పిలవడం జరిగింది. విప్లవాత్మక భావజాలం, రోషం కలిగిన శివరామ్ 1925లో అత్యంత ధైర్యంగా 'కకోరి కుట్ర'లో భాగంగా బ్రిటీష్ రైలును దోపిడీ చేసి తమ కార్యకలాపాలకు వినియోగించారు.

గాంధీ చేపట్టిన అహింసాత్మక పోరాటాన్ని వ్యతిరేకించి రక్తం చిందించి స్వాగతం సాధిద్దాం అంటూ విప్లవ మార్గం చేపట్టారు. తన స్వతంత్ర పోరాట విప్లవంలో భాగంగా చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, సుఖ్‌దేవ్ తాపర్‌లతో కలిసి పోరాట కత్తులు దూకడం ప్రారంభించారు. సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన లాలాలజపతి రాయ్‌ని బ్రిటీష్ పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చేయడం, దురదృష్టవశాత్తు ఆయన మరణించడం చూసి తట్టుకోలేక ఈ యువకులు నిప్పు కణికలుగా మారి నాటి బ్రిటీష్ పోలీస్ అధికారి జాన్ సాండర్స్‌ను 17 డిసెంబర్ 1928న హత్య చేసారు. ఈ హత్య కేసులో బ్రిటీష్ పోలీసులు రాజ్‌గురు, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్‌లను అరెస్టు చేసి మరణ శిక్ష విధించడం, 23 మార్చి 1931 ఉదయం లాహోర్ జైలులో ఉరి శిక్ష అమలు చేశారు. భరతమాత కోసం వీరు ప్రాణ త్యాగం చేయడం, స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఎర్రని అక్షరాలతో లిఖించబడింది. వీరు అమరత్వం పొందిన రోజును భారత ప్రభుత్వం "అమరత్వ దినం" లేదా "మార్టిర్స్ డే"గా పాటించి నివాళులు అర్పించడం జరుగుతోంది.

భీమా నది ఒడ్డున తను పుట్టిన ఇంటిని 'రాజ్ వాడా'గా నామకరణం చేసి స్మారక చిహ్నంగా మార్చారు. కాకుండా వారు పుట్టిన ఖేడ గ్రామాన్ని నేడు 'రాజ్‌గురు నగర్' పేరుతో పిలవడం జరుగుతోంది. ఢిల్లీలో 'షహీద్ రాజ్‌గురు కాలేజ్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ ఫర్ ఉమెన్' కళాశాలకు ఆయన పేరును పెట్టడం సముచితంగా ఉన్నది. తన 22వ ఏటనే ఉరి కంబం ఎక్కి ధైర్యంగా దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించడం నేటి భారత యువతకు ఆదర్శం కావాలి, వారు సాధించి పెట్టిన స్వాతంత్ర్యానికి అసలైన అర్థాన్ని చేకూర్చుదాం, దేశాభివృద్ధిలో భాగం అవుదాం.

-డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కోల్‌కతా వంటి నగరాలు భారతదేశ చరిత్ర, భవిష్యత్తు.. రెండింటికి గొప్ప ప్రతిరూపాలుగా ఉన్నాయి: ప్రధాని

న్యూఢిల్లీ, ఆగష్టు 23:పశ్చిమ బెంగాల్ రాజధాని నగరం కోల్‌కతాలో ఈ రోజు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రూ. 5,200 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధిని వేగవంతం చేసే అవకాశం తనకు మరోసారి లభించిందన్నారు. నోపారా నుంచి జై హింద్ విమానాశ్రయం వరకు కోల్‌కతా మెట్రోలో ప్రయాణించిన అనుభవాన్ని పంచుకున్నారు. ఈ పర్యటనలో చాలా మంది సహచరులతో మాట్లాడానని, కోల్‌కతా ప్రజా రవాణా వ్యవస్థ ఆధునికీకరించటం పట్ల అందరూ సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆరు వరుసల ఎలివేటెడ్ కోనా ఎక్స్‌ప్రెస్‌వేకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. వేల కోట్ల రూపాయలతో చేపట్టిన ఈ ప్రాజెక్టులకు సంబంధించి కోల్‌కతా, పశ్చిమ బెంగాల్ ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

"కోల్‌కతా వంటి నగరాలు భారతదేశ చరిత్ర, భవిష్యత్తు రెండింటికీ గొప్ప ప్రతిరూపాలు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా భారత్ చేస్తోన్న ప్రయాణంలో డమ్ డమ్, కోల్‌కతా వంటి నగరాలు కీలక పాత్ర పోషిస్తాయి" అని మోదీ వ్యాఖ్యానించారు. నేటి కార్యక్రమం కేవలం మెట్రో ప్రారంభం, రహదారి శంకుస్థాపనకే పరిమితమైనది కాదని పేర్కొన్న ఆయన.. ఆధునిక భారత్ పట్టణ రూపురేఖలను ఎలా మారుస్తుందో చెప్పేందుకు ఈ కార్యక్రమం ఒక నిదర్శనమని అన్నారు. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పాయింట్లు, ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచుతూ దేశంలోని నగరాల్లో హరిత రవాణాను ప్రోత్సహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధానంగా చెప్పారు. 'వ్యర్థాల నుంచి సంపద (వేస్ట్ టు వెల్త్)' కార్యక్రమం కింద నగరాలు ఇప్పుడు చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నాయని అన్నారు. మెట్రో సేవలు, మెట్రో నెట్‌వర్క్‌ల విస్తరణ గురించి ప్రధానంగా ప్రస్తావించిన ఆయన.. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌ను కలిగి ఉండటం తనకు గర్వకారణమని తెలిపారు. 2014కి ముందు దేశంలో 250 కిలోమీటర్ల మెట్రో మార్గం మాత్రమే ఉండేదని.. నేడు దేశంలో మెట్రో నెట్‌వర్క్ 1,000 కిలోమీటర్లకు పైకి చేరుకుందని ప్రధానంగా చెప్పారు. కోల్‌కతాలో కూడా మెట్రో విస్తరణ నిరంతరం జరుగుతోందని అన్నారు. కోల్‌కతా మెట్రో రైలు నెట్‌వర్క్‌లో సుమారు 14 కిలోమీటర్ల కొత్త మార్గం, ఏడు నూతన స్టేషన్లు కొత్తగా వచ్చాయని పేర్కొన్నారు. ఇవన్నీ కోల్‌కతా ప్రజల జీవన, ప్రయాణ సౌలభ్యాన్ని పెంచుతాయని అన్నారు.

"21వ శతాబ్దపు భారత్‌కు 21వ శతాబ్దపు రవాణా వ్యవస్థ అవసరం. అందుకే నేడు దేశవ్యాప్తంగా రైల్వేల నుంచి రోడ్ల వరకు, మెట్రోల నుంచి విమానాశ్రయాల వరకు ఆధునిక రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేస్తూ పరస్పరం అనుసంధానిస్తున్నాం" అని ప్రధానంగా పేర్కొన్నారు. ఒక నగరాన్ని మరొక నగరానికి అనుసంధానించడం మాత్రమే కాకుండా.. ప్రజలకు అందుబాటులో సరైన రవాణా సదుపాయాలు ఉండేలా చూసేందుకు కూడా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. కోల్‌కతా బహుళ నమూనా అనుసంధానతలో ఈ దార్శనికతను చూడొచ్చని అన్నారు. దేశంలోని అత్యంత రద్దీగా హౌరా, సీల్దా అనే రెండు రైల్వే స్టేషన్లు ఇప్పుడు మెట్రోతో అనుసంధానమయ్యాయని చెప్పారు. గతంలో ఈ స్టేషన్ల మధ్య ప్రయాణించేందుకు దాదాపు ఒకటిన్నర గంటలు పట్టేదని, మెట్రో వల్ల అది కొన్ని నిమిషాలకు తగ్గిపోయిందన్నారు. హౌరా స్టేషన్ సబ్‌వే బహుళ నమూనా అనుసంధానతను నిర్ధారిస్తోందని పేర్కొన్నారు. గతంలో తూర్పు రైల్వే, ఆగ్నేయ రైల్వే ప్రధాన స్టేషన్ల మధ్య రాకపోకలు సాగించేందుకు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వచ్చేదని, ఈ సబ్‌వే నిర్మాణంతో పరస్పర మార్పిడి సమయం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. కోల్‌కతా విమానాశ్రయం ఇప్పుడు మెట్రో నెట్‌వర్క్‌తో అనుసంధానమైందని.. ఇది నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు విమానాశ్రయానికి చేరుకోవటాన్ని సులభతరం చేస్తుందని ప్రధాని అన్నారు.

పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని పునరుద్ఘాటించారు. రైల్వే విద్యుదీకరణను 100 శాతం పూర్తి చేసిన రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్ ఒకటని ప్రధానంగా పేర్కొన్నారు. పురులియా, హౌరా మధ్య మెమూ రైలు నడపాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉందనీ, కేంద్ర ప్రభుత్వం ఈ డిమాండ్‌ను నెరవేర్చిందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని వివిధ మార్గాల్లో ప్రస్తుతం తొమ్మిది వందే భారత్ రైళ్లు, రెండు అమృత్ భారత్ రైళ్లు నడుస్తున్నాయని ప్రధాని తెలియజేశారు.

గత 11 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో అనేక ప్రధాన రహదారి ప్రాజెక్టులను పూర్తి చేసినట్లు ప్రధాని తెలిపారు. అనేక ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆరు వరుసల కోన ఎక్స్‌ప్రెస్‌వే పూర్తయిన తర్వాత నౌకాశ్రయాల మధ్య అనుసంధానత గణనీయంగా పెరుగుతుందని ప్రధానంగా పేర్కొన్నారు. ఈ మెరుగైన అనుసంధానత కోల్‌కతా, పశ్చిమ బెంగాల్‌ల భవిష్యత్తుకు కావాల్సిన పునాదిని బలపరుస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సీ.వీ. ఆనంద బోస్.. కేంద్ర మంత్రులు శ్రీ శాంతను ఠాకూర్, శ్రీ రవ్నీత్ సింగ్ బిట్టు, డాక్టర్ సుకాంత మజుందార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అధునాతన పట్టణ అనుసంధానత విషయంలో తమ నిబద్ధతకు అనుగుణంగా ప్రధాన మంత్రి కోల్‌కతాలో పలు మెట్రో రైల్వే ప్రాజెక్టులను ఆవిష్కరించారు. కొత్తగా నిర్మించిన 13.61 కి.మీ.ల మెట్రో మార్గాన్ని, ఆయా మార్గాల్లోని మెట్రో సేవలను ప్రారంభించారు. ఆయన జెస్సోర్ రోడ్ మెట్రో స్టేషన్‌ను సందర్శించారు. అక్కడ నుంచి నోపారా–జై హింద్ బిమన్‌బందర్ మెట్రో రైలును ప్రారంభించారు. వీటితో పాటు వర్చువల్ విధానంలో సీల్దా–ఎస్‌ప్లానేడ్ మెట్రో రైలు, బెలెఘాటా–హేమంత ముఖోపాధ్యాయ మెట్రో రైలును ప్రారంభించారు. జెస్సోర్ రోడ్ మెట్రో స్టేషన్ నుంచి జై హింద్ బిమన్‌బందర్ వరకు మెట్రో ప్రయాణించిన ఆయన? తిరిగి మెట్రో రైలులోనే జై హింద్ బిమన్‌బందర్‌కు వచ్చారు.

కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి ఈ మెట్రో విభాగాలను, హౌరా మెట్రో స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన సబ్‌వేను ప్రారంభించారు. నోపారా–జై హింద్ బిమన్‌బందర్ మెట్రో మార్గం విమానాశ్రయానికి వెళ్లటాన్ని సులభతరం చేస్తుంది. సీల్దా–ఎస్‌ప్లానేడ్ మెట్రో రెండింటి మధ్య ప్రయాణ సమయాన్ని దాదాపు 40 నిమిషాల నుంచి కేవలం 11 నిమిషాలకు తగ్గిస్తుంది. బెలెఘాటా–హేమంత ముఖోపాధ్యాయ మెట్రో మార్గం ఐటీ హబ్‌కు అనుసంధానతను పెంచటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ మెట్రో మార్గాలు కోల్‌కతాలో అత్యంత రద్దీగా ఉండే కొన్ని ప్రాంతాలను కలుపుతాయి. ఇవి ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. బహుళ నమూనా అనుసంధానతను బలోపేతం చేస్తాయి. లక్షలాది మంది రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుస్తాయి.

ఇక్కడ రోడ్డు రవాణా మౌలిక సదుపాయాలకు పెద్ద ఊతం ఇస్తూ.. రూ. 1,200 కోట్లతో చేపట్టనున్న 7.2 కి.మీ.ల ఆరు వరుసల ఎలివేటెడ్ కోన ఎక్స్‌ప్రెస్‌వేకు శంకుస్థాపన చేశారు. ఇది హౌరా, చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాలు.. కోల్‌కతా మధ్య అనుసంధానతను పెంచటమే కాకుండా ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో వాణిజ్యం, పర్యాటక రంగానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

# పోస్టాఫీసుల ద్వారా మ్యూచువల్ ఫండ్లు... పంపిణీ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన తపాలా శాఖ, ఏఎంఎఫ్ఐ

న్యూఢిల్లీ, ఆగష్టు 23:ఆర్థిక సమ్మిళిత్వాన్ని పెంపొందించే దిశగా కీలక ముందడుగులో భాగంగా, భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని తపాలా శాఖ (డీఓపీ), భారత మ్యూచువల్ ఫండ్ల సంఘం (ఏఎంఎఫ్ఐ) మధ్య ఒక ముఖ్యమైన అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ఆగష్టు 22, 2025న ఏఎంఎఫ్ఐ 30వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా ముంబయిలో జరిగింది.

ఈ కీలక ఒప్పందం ఒక కొత్త సేవల విధానానికి నాంది పలికింది. దీని ప్రకారం, భారత తపాలా విభాగం తన విస్తృత నెట్‌వర్క్ ద్వారా మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను సులభతరం చేసేందుకు పంపిణీదారుగా వ్యవహరిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల పౌరులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా పోస్టాఫీసుల పట్ల ఉన్న నమ్మకం, వాటి పరిధిని ఉపయోగించి మ్యూచువల్ ఫండ్ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ ఒప్పందం లక్ష్యం.

సెబీ ఛైర్మన్ శ్రీ తుహిన్ కాంత పాండే సమక్షంలో జరిగిన ఈ అవగాహన ఒప్పందంపై తపాలా శాఖ జనరల్ మేనేజర్ (వ్యాపారాభివృద్ధి) శ్రీమతి మనీషా బన్సాల్ బాదల్, ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శ్రీ వి.ఎన్.చలసాని అధికారికంగా సంతకాలు చేశారు.

ఈ ఒప్పందం ప్రకారం చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మ్యూచువల్ ఫండ్లను అందుబాటులోకి తెచ్చేందుకు తపాలా శాఖ ఉద్యోగులు పంపిణీదారులుగా వ్యవహరిస్తారు. ఈ ప్రాంతాల్లో వ్యవస్థీకృత ఆర్థిక ఉత్పత్తుల అందుబాటు తక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా గ్రామీణ, పాక్షిక పట్టణాల్లో తపాలా శాఖ ఉనికి విస్తృతంగా ఉన్నా మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల గురించి అవగాహన తక్కువగా ఉంది.

ఈ భాగస్వామ్యం దేశంలోని మారుమూల ప్రాంతాలను ఆర్థిక లావాదేవీల పరిధిలోకి తీసుకురావాలన్న డీఓపీ నిబద్ధతకు నిదర్శనం. అంతేకాక భారతదేశంలో వృత్తిపరమైన, పెట్టుబడిదారులకు అనుకూలమైన మ్యూచువల్ ఫండ్ వ్యవస్థను ప్రోత్సహించాలనే ఏఎంఎఫ్ఐ లక్ష్యానికి ఇది మరింత బలం చేకూరుస్తుంది.

ఈ ఎంఓయూ ఆగస్టు 22, 2025 నుంచి ఆగస్టు 21, 2028 వరకు మూడేళ్ల పాటు కొనసాగుతుంది.

# సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

**- కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్**




నల్గొండ, ఆగషు 23:రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ విధానం రద్దు చేసి వెంటనే ఓపీఎస్ విధానాన్ని అమలు పరచాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం భోజన విరామ సమయంలో కొండమల్లేపల్లి తాసీల్దార్ నరేందర్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు.

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 1 సెప్టెంబర్, 2004 తర్వాత నియామకమైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ కొండమల్లేపల్లి మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కొమిరె సైదులు, బద్దెల అంజయ్య, బొమ్ము రవి, మందడి శ్రీకాంత్ రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

# సెమికాన్ ఇండియా-2025 నాలుగో ఎడిషన్‌ను ప్రారంభించనున్న ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 23:సెమికాన్ ఇండియా–2025 నాలుగో ఎడిషన్‌ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2025 సెప్టెంబర్ 2న న్యూఢిల్లీలోని యశోభూమి (భారత అంతర్జాతీయ సమావేశ వేదిక, ప్రదర్శన కేంద్రం)లో అధికారికంగా ప్రారంభిస్తారు. భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ కేంద్రంగా నిలపాలన్న లక్ష్యానికి అనుగుణంగా.. అంతర్జాతీయ స్థాయిలో ఈ రంగానికి నేతృత్వ స్థానంలో ఉన్నవారు, సెమీకండక్టర్ పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు సహా కీలక భాగ్యాములందరినీ సెమికాన్ ఇండియా– 2025 నాలుగో ఎడిషన్ సమావేశపరుస్తుంది.

సెమికాన్ ఇండియా కార్యక్రమం కింద భారత సెమీకండక్టర్ ప్రస్థానం బలంగా ఊపందుకుంటోంది. ఇప్పటివరకు భారీ ఫాబ్రికేషన్ యూనిట్లు, 3డీ హెటెరోజీనస్ ప్యాకేజింగ్, సమ్మిళిత సెమీకండక్టర్లు (సిలికాన్ కార్బైడ్‌తోపాటు), అవుట్ సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ (ఓఎస్ఏటీ) సహా వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న రంగాలలో 10 ప్రాజెక్టులను భారత ప్రభుత్వం ఆమోదించింది. సెమీకండక్టర్ కార్యకలాపాలకు సంబంధించి ప్రతీ దశలో అంతర్జాతీయంగా భారత్ స్థానాన్ని బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టులు కీలక విజయాలుగా నిలుస్తాయి.

సెమీకండక్టర్లను ప్రాథమిక పరిశ్రమగా గుర్తిస్తూ.. 280కి పైగా విద్యాసంస్థలు, 72 అంకుర సంస్థలకు అత్యాధునిక డిజైన్ సాధనాలను అందించడం ద్వారా.. పరిశోధన, ఆవిష్కరణ, డిజైన్ పరంగా ప్రభుత్వం సహకారాన్ని అందిస్తోంది. డిజైన్ ఆధారిత ప్రోత్సాహక (డీఎల్ఐ) పథకం కింద 23 అంకుర సంస్థలు ఆమోదం పొందాయి. భారతీయ ఆవిష్కర్తలు కీలక అప్లికేషన్లపై పనిచేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఈ కార్యక్రమాల ద్వారా.. క్లోజ్డ్ సర్క్యూట్ టెలివిజన్ (సీసీటీవీ), నావిగేషన్ వ్యవస్థలు, మోటార్ కంట్రోలర్లు, కమ్యూనికేషన్ చిప్స్, మైక్రోప్రాసెసర్ యూనిట్ల వంటి అప్లికేషన్ల కోసం సెమీకండక్టర్ల రూపకల్పన, తయారీ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా భారత్ పురోగమిస్తోంది. ఈ చర్యలన్నీ ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశంలో బలమైన, సమగ్రమైన సెమీకండక్టర్ వ్యవస్థను నెలకొల్పడంలో నిశ్చయాత్మక ముందడుగు.

భారత సెమీకండక్టర్ విప్లవాన్ని వేగవంతం చేసేలా.. సెమీండక్టర్ పరిశ్రమ, భారత సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)లకు ప్రోత్సాహాన్నిచ్చే సెమీ (ఆఇఓఎ), ఎలక్ట్రానిక్స్ – సమాచార సాంకేతికత మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో 'సెమికాన్ ఇండియా–2025' కార్యక్రమాన్ని ప్రకటించాయి.

'బిల్డింగ్ ది నెక్ట్స్ సెమీ కండక్టర్ పవర్ హౌస్' ఇతివృత్తంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఫాబ్రికేషన్స్, అడ్వాన్స్ ప్యాకేజింగ్, అధునాతన తయారీ, కృత్రిమ మేధ, సరఫరా వ్యవస్థ నిర్వహణ, సుస్థిరత, కార్మిక శక్తిని పెంచడం, డిజైన్లు ? అంకుర సంస్థల వంటి కీలక రంగాల్లో ఆవిష్కరణలు, ప్రస్తుత ధోరణులపై విలువైన సమాచారాన్ని అందిస్తుంది. ఇందులో 6 దేశాల రౌండ్ టేబుల్ సమావేశాలు కూడా ఉంటాయి.

"సెమికాన్ ఇండియా ప్రదర్శనలో ప్రపంచవ్యాప్తంగా సెమీ కండక్టర్ పరిశ్రమలోని ప్రతీ దశకు చెందిన దాదాపు 350 మంది ఎగ్జిబిటర్లు పాల్గొంటారు. 6 రౌండ్ టేబుల్ సమావేశాలు, 4 దేశ ప్రదర్శన వేదికలుంటాయి. కార్యక్రమంలో 9 రాష్ట్రాల భాగస్వామ్యం ఉంటుంది. 15,000కు పైగా సందర్శకులు హాజరవుతారని అంచనా. సెమీ కండక్టర్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో తాజా పురోగతులను ప్రదర్శించేందుకు దక్షిణాసియాలో అతిపెద్ద వేదికను సెమికాన్ ఇండియా అందిస్తోంది" అని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ తెలిపారు.

"ప్రపంచ ఎలక్ట్రానిక్స్ డిజైన్, తయారీ, సరఫరా వ్యవస్థ అంతటా సభ్య కంపెనీల ఉమ్మడి నైపుణ్యం సామర్థ్యాలను సెమికాన్ ఇండియాకు తీసుకువస్తోంది, ఇది భారత్ లో సెమీకండక్టర్ రంగం విస్తరణ, పరిశ్రమ సరఫరా వ్యవస్థ సుస్థిరత – రెండింటినీ ముందుకు తీసుకెళ్లడంలో సహాయపడుతుంది" అని సెమీ అధ్యక్షుడు, సీఈఓ అజిత్ మనోచా అన్నారు. "ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్, వ్యాపార అభివృద్ధిలో సెమికాన్ అవకాశాలను ఈ కార్యక్రమంలో ప్రదర్శిస్తారు. సాంకేతికత, మార్కెట్ ధోరణులపై ప్రముఖ పరిశ్రమ నిపుణులు ఈ కార్యక్రమంలో విలువైన ఆలోచనలను అందిస్తారు" అని చెప్పారు.

సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో సాంకేతిక పురోగతిని గరిష్ట స్థాయికి చేర్చడం, అలాగే భారతదేశ సెమీకండక్టర్ రంగాన్ని బలోపేతం చేయడానికి దృష్టి సారించిన విధానాలను వెలుగులోకి తీసుకురావడం సెమికాన్ ఇండియా 2025 ఉద్దేశం.

ఈ కార్యక్రమం ఆలోచనలు, భాగస్వామ్యం, ఆవిష్కరణల విశిష్ట సమ్మేళనం. రేపటి క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవడానికి ఇది ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పించడంతో పాటు, సెమీకండక్టర్ రంగం అంతటా సహకారాన్ని పెంపొందిస్తుంది. ఈ సంవత్సరం పాల్గొనేవారి సంఖ్య విశేష స్థాయిలో ఉంటుందని భావిస్తున్నట్టు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి, ఐఎస్ఎం సీఈఓ శ్రీ అమితేష్ కుమార్ సిన్హా తెలిపారు.

"భారత సెమీకండక్టర్ పరిశ్రమ ఒక విప్లవాత్మక దశకు చేరుకోవడానికి సిద్ధంగా ఉంది. దేశీయ విధానాలు, ప్రైవేట్ రంగ సామర్థ్యాలు కలిసి, దేశాన్ని ప్రపంచ స్థాయిలో ముందుకు నడిపిస్తున్నాయి. ఈ మార్పు దశలో, మరింత వృద్ధి, కొత్త ఆవిష్కరణలను సాధించడానికి భాగస్వామ్యాన్ని, ఒక బలమైన సానుకూల వ్యవస్థను నిర్మించడం చాలా ముఖ్యం. ఈ ప్రక్రియలో సెమికాన్ ఇండియా 2025 ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది" అని సెమీ ఇండియా, ఐఈఎస్ఏ అధ్యక్షుడు అశోక్ చందక్ అన్నారు.

ఈ సంవత్సరం కార్యక్రమానికి ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు, అప్లయిడ్ మెటీరియల్స్, ఏఎస్ఎంఎల్, ఐబీఎం, ఇన్ఫినియాన్, కేఎల్ఏ, లామ్ రీసెర్చ్, మెర్క్, మైక్రాన్, పీఎస్ఎంసీ, రాపిడస్, శాన్డిస్క్, సిమెన్స్, ఎస్కే హైనిక్స్, టాటా ఎలక్ట్రానిక్స్, టోక్యో ఎలక్ట్రాన్, మరెన్నో అగ్రశ్రేణి కంపెనీల నుంచి కూడా పరిశ్రమ ప్రముఖులు హాజరు కానున్నారు.

మూడు రోజుల పాటు జరిగే ఈ అత్యంత ప్రాధాన్యతా కార్యక్రమంలో, సెమీకండక్టర్ రంగంలో తదుపరి ఆవిష్కరణలను, వృద్ధిని ముందుకు నడిపించనున్న ఉన్నత స్థాయి కీలక ప్రసంగాలు, ప్యానల్ చర్చలు, ఫైర్‌సైడ్ చాట్‌లు, పేపర్ ప్రెజెంటేషన్లు, ఆరు అంతర్జాతీయ రౌండ్ టేబుల్ సమావేశాలు, మరెన్నో విభిన్న కార్యకలాపాలు ఉంటాయి.

ఈ కార్యక్రమంలో 'వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్ పెవిలియన్' కూడా ఉంటుంది, ఇది మైక్రో ఎలక్ట్రానిక్స్ రంగంలో ఉద్యోగ అవకాశాలను ప్రదర్శించడానికి, కొత్త ప్రతిభను ఆకర్షించడానికి ఉపయోగపడుతుంది.

సెమికాన్ ఇండియా 2025 కోసం సందర్శకుల రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది.

సెమికాన్ ఇండియా, సెమీ ఆధ్వర్యంలో ఏటా జరిగే ఎనిమిది సెమికాన్ ప్రదర్శనలలో ఒకటి. ఇది ప్రపంచ సెమీకండక్టర్ డిజైన్, తయారీ రంగంలో ఉన్న కార్యనిర్వహణాధికారులను, ప్రముఖ నిపుణులను ఒకచోట చేర్చే వేదికగా ఉంది. ఈ ప్రస్తుత కార్యక్రమం సాంకేతిక ఆవిష్కరణల భవిష్యత్తు దిశగా ఒక ప్రయాణం ప్రారంభాన్ని సూచిస్తూ, ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో భాగస్వామ్యాన్ని, సుస్థిరత్వాన్ని పెంపొందిస్తుంది.

సెమీ అనేది సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ డిజైన్, తయారీ సరఫరా శ్రేణి లో ప్రపంచవ్యాప్తంగా 3,000 పైగా సభ్య కంపెనీలను, 1.5 మిలియన్ల నిపుణులను కలిపే గ్లోబల్ ఇండస్ట్రీ అసోసియేషన్.

# రైతుకు అతి తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు.. నానో యూరియాపై అవగాహనలో డీఏవో దేవ్ కుమార్



మెదక్, ఆగష్టు 23: వ్యవసాయంలో నూతనంగా వస్తున్నటువంటి ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని రైతులు అలవర్చుకోవాలని.. అప్పుడే రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక పంటల దిగుబడి పెరిగి అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి (ఆయా) దేవ్ కుమార్ అన్నారు. శనివారం సోమక్కపేట గ్రామంలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. నానో యూరియా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయబడినటువంటి ప్రత్యేక రకమైన ద్రవరూపమైన ఎరువు అని.. దీనివల్ల మొక్కల రంధ్రాల ద్వారా పోషకాలు నేరుగా మొక్కలోకి వెళ్లడం ద్వారా పంటలు దిగుబడిపై గణనీయమైన సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని వివరించారు.

క్షేత్రస్థాయిలో రైతులు ముఖ్యంగా రసాయన ఎరువులు అయినటువంటి యూరియాను మోతాదుకు మించి వాడడం ద్వారా నేల కాలుష్యంతోపాటుగా రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయని, అదే విధంగా సాంప్రదాయ పద్ధతిలో గుళికల రూపంలో వేసినటువంటి ఎరువుల్లో కేవలం 30 నుంచి 40 శాతం మాత్రమే పంట తీసుకోవడం జరుగుతుందని అన్నారు. మిగతా ఎరువులు వృధాగా పోయే అవకాశం ఉంటుంది. ఈ నానో టెక్నాలజీ ద్వారా తయారు చేసిన నానో యూరియా విధానంలో పత్ర రంధ్రాల ద్వారా నత్రజని ఎరువులు మొక్కలకు 70 నుంచి 80 శాతం సంగ్రహించడం ద్వారా చెరువుల వినియోగ సామర్థ్యం పెరిగి రైతుకు పంట దిగుబడిలో మంచి ప్రభావం చూపుతోందన్నారు.

ముఖ్యంగా రైతుకు అతి తక్కువ ఖర్చుతో ఈ ద్రవరూప ఎరువులు వాడడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. సాంప్రదాయ యూరియా కంటే చాలా తక్కువ మోతాదులో అవసరం అవుతుంది కనుక నత్రజని లీచింగ్, నీటి కాలుష్యం, గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను తగ్గిస్తుంది. నానో యూరియాను ఎకరాకు ఒక బాటిల్ (500 మి. లీ) పిచికారి చేయాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వ్యవసాయ శాఖ ద్వారా క్షేత్రస్థాయిలో విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో డీఏఓ దేవ్ కుమార్, ఏవో రాజశేఖర్ గౌడ్, ఏఈఓలు కృష్ణవేణి, అనిత, శ్రీనివాస్ రెడ్డి, మధు యాదవ్, పాండ్యా, ప్రభు, నర్సింగ్, శంకరయ్య, లక్ష్మణ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం పరిశీలన

ఖమ్మం, ఆగష్టు 23: బోనకల్లు మండల కేంద్రంలోని విద్య వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ రామకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలో ఆధార్ నమోదు చేసుకోని విద్యార్థులను గుర్తించాలన్నారు. వారిని కేంద్రానికి తీసుకువచ్చి పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి దామాల పుల్లయ్య, ఆధార్ నమోదు ఆపరేటర్ అమీర్ పాషా, ఎంఆర్పీ, సీఆర్పీలు ఉన్నారు.

# స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ దీక్షలు

నారాయణపేట, ఆగష్టు 23: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ , ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ శనివారం జిల్లా కేంద్రంలో ఒకరోజు దీక్షను నిర్వహించింది . ఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బలరాం , రాష్ట్ర నాయకులు నరహరి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 8,150 వేల కోట్లు స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ కింద తక్షణమే విడుదల చేయాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు పూర్తవుతున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి నియమించకపోవడం సిగ్గుచేటని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తుందని విమర్శించారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించకుండా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించకుండా ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ , ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకుని టీసీ, బోనఫైడ్ కోసం కళాశాలలకు వెళితే పెండింగ్ ఫీజు గురించి అడుగుతున్నారని తెలిపారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువుకు దూరం అయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు.

# థాయిలాండ్‌లో జరిగిన 23వ సర్వసభ సమావేశంలో ఏబీడీ కార్యనిర్వాహక మండలి అధ్యక్షురాలిగా ఎన్నికైన భారత్

న్యూఢిల్లీ, ఆగష్టు 23:థాయిలాండ్‌లోని ఫుకెట్‌లో 2025 ఆగస్టు 19 నుంచి 21 వరకు జరిగిన 23వ ఏఐబీడీ సాధారణ సమావేశంలో ఆసియా-పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రాడ్‌కాస్టింగ్ డెవలప్‌మెంట్ (ఏఐబీడీ) కార్యనిర్వాహక వర్గ బోర్డు ఛైర్మన్‌గా అత్యధిక ఓట్లతో భారత్ ఎన్నికవ్వడం ఒక విశేషమైన విజయం.

2016 తరువాత భారత్ మళ్లీ ఏఐబీడీ కార్యనిర్వాహక మండలి ఛైర్మన్ పదవిని చేపట్టడం గొప్ప మైలురాయిగా నిలిచింది. తాజా పరిణామంతో ఏఐబీడీలో భారత నాయకత్వ పాత్ర మరింత బలోపేతం కానుంది. ప్రస్తుతం భారత్ ఏఐబీడీ సాధారణ సమావేశ అధ్యక్ష పదవిలో ఉంది. ఇది 2025 ఆగస్టు వరకు కొనసాగనుంది.

తమపై నిరంతర నమ్మకాన్ని ఉంచి, ఇస్తున్న మద్దతుకు సభ్య దేశాలు, సంస్థలకు ప్రసార భారతి సీఈఓ, ఏఐబీడీ జీసీ అధ్యక్షుడు శ్రీ గౌరవ్ ద్వివేది ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తరపున ఆయన మాట్లాడుతూ ఇలా అన్నారు:

'భారత నాయకత్వంపై మీరు ఉంచిన నమ్మకాన్ని మేమెంతో విలువైనదిగా భావిస్తున్నాం. గత అదు దశాబ్దాలుగా మేము ఏఐబీడీలో వివిధ స్థాయిల్లో మేము ఒక జట్టుగా కలిసి పనిచేశాం. భవిష్యత్తులో కూడా సమష్టిగా పనిచేసి ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారా ఏఐబీడీ కార్యక్రమాలు, ప్రణాళికలను ముందుకు తీసుకెళ్లేలా కృషి చేస్తాం' అని తెలిపారు.

అలాగే కొత్తగా ఎన్నికైన అధికారులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏఐబీడీని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి వారితో కలిసి పనిచేసేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నట్లు చెప్పారు.

ఏఐబీడీ గురించి..

యునెస్కో ఆధ్వర్యంలో 1977లో ఏఐబీడీ ఏర్పాటైంది. ఇది ప్రత్యేకమైన ప్రాంతీయ అంతర్గత ప్రభుత్వ సంస్థ. ప్రస్తుతం 45 దేశాలకు చెందిన 92కు పైగా సంస్థలకు దీనిలో సభ్యత్వం ఉంది.

భారత్ ఏఐబీడీ వ్యవస్థాపక సభ్య దేశం. ఏఐబీడీలో సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ తరపున భారత ప్రభుత్వానికి చెందిన ప్రసార భారతి ప్రాతినిధ్యం వహిస్తోంది.

23వ సర్వసభ్య సమావేశం (జీసీ 2025) గురించి..

ఏఐబీడీ 23వ సర్వసభ్య సమావేశం, దాని అనుబంధ సమావేశాలు శ్రీ గౌరవ్ ద్వివేది అధ్యక్షతన ఫుకెట్‌లో విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగంలోని కీలక వ్యక్తులు, సంస్థలు పాల్గొన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో విధాన మార్పిడి, నిపుణల భాగస్వామ్యం ద్వారా శక్తిమంతమైన, సహకార మీడియా వాతావరణాన్ని కల్పించడంపై దృష్టి సారించింది. 'ప్రజల శాంతి, శ్రేయస్సు కోసం మీడియా' అనేది ఈ సంవత్సర ఇతివృత్తం.

ఈ ప్రఖ్యాత పదవికి దేశం ఎన్నికవ్వడం ప్రపంచ ప్రసార రంగంలో భారత నాయకత్వంపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. అలాగే ప్రపంచ మీడియా అభివృద్ధి చెందడంలో భారత్ మరింత వ్యూహాత్మక, కీలక పాత్ర పోషించేందుకు మార్గం సుగమం చేస్తుంది.

# ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి : డీవైఎస్వో




హన్మకొండ, ఆగష్టు 23: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌ను ప్రతి ఒక్క క్రీడాకారుడు స్ఫూర్తిగా తీసుకోవాలని హనుమకొండ యువజన క్రీడల అధికారి గుగులోతు అశోక్‌కుమార్ నాయక్ అన్నారు. శనివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ ఎస్)లో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడోత్సవాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. భారతదేశానికి ఒలింపిక్స్‌లో తొలి బంగారు పతకం తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఒలింపిక్స్‌లో హాకీ క్రీడలో వరుసగా మూడు పతకాలు రావడానికి ముఖ్యభూమిక పోషించారని, అందుకే ఆయన జయంతిని భారతదేశం మొత్తం క్రీడాదినోత్సవంగా నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జేఎన్ఎస్ స్టేడియంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 10 సంవత్సరాలలోపు పిల్లలకు రన్నింగ్ పోటీలు, మ్యూజికల్ చైర్, బేబీ క్రాలింగ్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఆదివారం ఉదయం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అశోక్‌కుమార్ తెలిపారు. ఈ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి : ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్గొండ, ఆగషు 23: రానున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు నల్లగొండ జిల్లాలో శాంతియుత వాతావరణం నడుమ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రజలను శనివారం ఒక ప్రకటనలో కోరారు. నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ వినాయక మండపల వద్ద గాని, ఊరేగింపులకు గాని డి.జేలు ఏర్పాటు చేయకూడదన్నారు. గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. మండప నిర్వాహకులు ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విగ్రహాలను రోడ్డుకు ఇరుపక్కల ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో ఇతర మతాల వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని, సోషల్ మీడియాపై ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మండప నిర్వహకులు అవసరమైన అన్ని శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటు చేయుటకు నిర్వాహకు \https://policeportal.tspolice.gov.in/index.htm నందు వివరాలు పొందుపరిచి అప్లికేషన్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు వారి చూచనలు పాటిస్తూ సహకరించాలని పేర్కొన్నారు.

### గణేష్ మండప నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలు :

- మండపం ఏర్పాటు చేయు స్థలం వారి యాజమానుల అనుమతులు తీసుకోవాలి
- గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలి
- షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరు ఉపయోగించాలి
- గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లను మండపంలో ఏర్పాటు చేయాలి
- గణేష్ మండపాలను ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి
- గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో మంచి నాణ్యత గల స్టేజి, షెడ్డు ఏర్పాటు చేయవలెను
- గణేష్ మండపంలో 24 గంటలు ఇద్దరు వాలంటీర్ ఉండే విధంగా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలి
- గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శన దృష్టిలో ఉంచుకుని మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్లను నియమించాలి
- గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట అడటం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం
- విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి. పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి సంతకం, సూచనలు చేస్తారు.
- ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలి
- మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి
- సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదు, ఎవరికైనా సందేహాలు ఉన్నా సంబంధిత పోలీస్ వారికి లేదా డయల్ కి సమాచారంఅందించా లి.

# బిహార్‌లోని గయలో రూ. 12, 000 కోట్ల విలువైన వివిధ బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 23:బిహార్‌లోని గయలో రూ.12,000 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. జ్ఞానం, విముక్తికి పవిత్ర నగరమైన గయకు ప్రధానమంత్రి వందనాలు అర్పించారు. విశిష్టమైన విష్ణుపాద ఆలయం ఉన్న ఈ పుణ్యభూమి నుంచి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గయ ప్రాంతం ఆధ్యాత్మికత, శాంతికి నిలయం అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఈ పవిత్ర నేలలోనే గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందారని గుర్తుచేశారు.. 'గయా జీ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం ప్రాచీనమైనది మాత్రమే కాక అత్యంత గొప్పది' అని మోదీ పేర్కొన్నారు. ఈ నగరాన్ని కేవలం 'గయ' అని కాకుండా గౌరవంగా 'గయా జీ' అని పిలవాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజల భావనను గౌరవించినందుకు బిహార్ ప్రభుత్వాన్ని ప్రధానమంత్రి అభినందించారు. గయా జీ వేగవంతమైన అభివృద్ధి కోసం కేంద్రం, బిహార్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.

పవిత్రమైన గయా జీ ప్రాంతం నుంచి ఒక్క రోజులోనే రూ. 12,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభమై, శంకుస్థాపనలు జరిగాయని ప్రధానమంత్రి తెలిపారు. ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, పట్టణాభివృద్ధి వంటి కీలక రంగాలకు చెందిన ఈ ప్రాజెక్టులు బిహార్ పారిశ్రామిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతోపాటు యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని వ్యాఖ్యానించారు. ఇలాంటి గొప్ప ప్రాజెక్టులను అందుకుంటున్నందుకు బిహార్ ప్రజలను అభినందించారు. రాష్ట్రంలో ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఓ ఆసుపత్రి, పరిశోధనా కేంద్రాన్ని కూడా నేడు ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా ఇకపై బిహార్ ప్రజలకు క్యాన్సర్ చికిత్స కోసం అదనపు సౌకర్యం లభించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

పేదల జీవితాల నుంచి కష్టాలను తొలగించడం, మహిళల జీవితాలను సులభతరం చేయడం ప్రజాసేవకుడిగా తనకు అత్యంత సంతృప్తినిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.పేదలకు పక్కా ఇళ్ళు అందించడం తన ప్రధాన లక్ష్యాలలో ఒకటని పునరుద్ఘాటించారు. అవసరమైన ప్రతి పేదవాడికీ పక్కా ఇల్లు లభించే వరకు తాను విశ్రాంతి తీసుకోనని తెలిపారు. ఈ సంకల్పంతోనే గత 11 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా పేదల కోసం 4 కోట్ల పక్కా ఇళ్ళు నిర్మించామని తెలిపారు. కేవలం బిహార్ లోనే 38 లక్షలకు పైగా ఇళ్ళ నిర్మాణం జరిగిందని, గయ జిల్లాలో 2 లక్షలకు పైగా కుటుంబాలు తమ సొంత పక్కా ఇళ్ళు పొందాయని మోదీ ప్రస్తావించారు. ఇవి కేవలం ఇళ్ళు మాత్రమే కాదని, పేదల గౌరవానికి చిహ్నాలని ప్రధాని అన్నారు. విద్యుత్, నీరు, మరుగుదొడ్లు, గ్యాస్ కనెక్షన్లతో ఈ ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. వీటితో పేద కుటుంబాలు కూడా సౌలభ్యం, భద్రత, గౌరవంతో జీవించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.

బిహార్‌లోని మగధ్ ప్రాంతంలో 16,000కు పైగా కుటుంబాలు నేడు పక్కా ఇళ్ళు పొందాయని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది దీపావళి, ఛత్ పూజ వేడుకలు ఈ ఇళ్లలో మరింత ఉత్సాహంగా జరుగుతాయని తెలిపారు. ఇళ్లు పొందిన ప్రతి లబ్ధిదారుల కుటుంబాలకు అభినందనలు తెలియజేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇంకా లబ్ది పొందేందుకు ఎదురుచూస్తున్న వారికి కూడా త్వరలో ఈ ప్రయోజనం చేరుతుందని, ప్రతి పేద వాడికి పక్కా ఇల్లు లభించే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని మోదీ హామీ ఇచ్చారు.

'చంద్రగుప్త మౌర్యుడు, చాణక్యుల ప్రాంతం బిహార్. శత్రువుల నుంచి భారత్ కు సవాళ్లు ఎదురైనప్పుడల్లా దేశానికి బిహార్ కవచంగా నిలిచింది' అని మోదీ పేర్కొన్నారు. బిహార్ నేలపై చేసిన ఏ ప్రతిజ్ఞ కూడా నెరవేరకుండా పోలేదని అన్నారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ప్రస్తావిస్తూ.. తమ మతాన్ని అడిగి మరీ అమాయక పౌరులను ఉగ్రవాదులు హతమార్చారని తెలిపారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాను బిహార్ నుంచే ప్రతిజ్ఞ చేశానని గుర్తుచేశారు. బిహార్ గడ్డపై చేసిన ఆ సంకల్పం నెరవేరడాన్ని నేడు ప్రపంచం కళ్లజూస్తోందని ఆయన చెప్పారు. పాకిస్థాన్ ప్రయోగిస్తున్న డ్రోన్, క్షిపణి దాడులను భారత్ గాల్లోనే అడ్డగించి నిర్వీర్యం చేసిందని మోదీ ప్రస్తావించారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన ఒక్క క్షిపణి కూడా భారత్ కు హాని కలిగించలేదని మోదీ స్పష్టం చేశారు.

'ఆపరేషన్ సిందూర్ దేశ రక్షణ వ్యూహంలో కొత్త అధ్యాయాన్ని లిఖించింది' అని మోదీ పేర్కొన్నారు. భారత్ లోకి ప్రవేశించిన ఉగ్రవాదులు, దాడులు చేసిన ముష్కరులెవరూ తప్పించుకోలేరని అన్నారు.. ఉగ్రవాదులు పాతాళంలో దాక్కున్నప్పటికీ, దేశ క్షిపణులు వారిని అక్కడే సమాధి చేస్తాయని వ్యాఖ్యానించారు.

'బిహార్ ను వేగవంతంగా అభివృద్ధి చేయడం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత' అని పేర్కొన్నారు. బిహార్ నేడు సమగ్ర అభివృద్ధి మార్గంలో ముందుకు సాగుతోందని అన్నారు. బిహార్ లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సమస్యలకు ఇటీవలి కాలంలో పరిష్కారాలు లభించాయని, ఇవి రాష్ట్ర అభివృద్ధికి కొత్త మార్గాలను సృష్టించాయని తెలిపారు. 'లాంతరు పాలన' సమయంలోని దారుణమైన పరిస్థితులను గుర్తుచేసుకుంటూ.. ఆ కాలంలో ఈ ప్రాంతం మావోయిస్టు స్థావరంగా మారిపోయిందని గుర్తుచేశారు. నక్సలైట్ల కార్యలపాలు అధికంగా ఉండేవని, సూర్యాస్తమయం తర్వాత ప్రజలు బయట తిరగాలంటే భయపడేవారని అన్నారు. గయాజీ వంటి నగరాలు లాంతరు పాలనలో చీకటిలో మునిగిపోయాయని పేర్కొన్నారు. వేలాది గ్రామాలకు విద్యుత్ స్తంభాల వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలు కూడా లేకుండా పోయాయని ప్రధాన మంత్రి విమర్శలు గుప్పించారు. లాంతరు యుగ పాలకులు బిహార్ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని పేర్కొన్నారు. విద్య, ఉపాధి లేని కారణంగా బిహారీలు తరతరాలుగా వలస వెళ్లాల్సి వచ్చిందని అన్నారు.

ప్రతిపక్షాలు, దాని మిత్రదేశాలు బిహార్ ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తాయని మోదీ పేర్కొన్నారు. పేదల సుఖ, దుఃఖాలపై.. గౌరవ మర్యాదలపై వారికి ఎలాంటి ఆందోళన లేదని తెలిపారు. బిహార్ ప్రజలను తమ రాష్ట్రంలోకి అనుమతించబోమని ఒక పార్టీకి చెందిన మాజీ ముఖ్యమంత్రి ఒకసారి వేదికపై నుంచి బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. అలాంటి నాయకుల ద్వేషం, ధిక్కారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఆ అవమానాన్ని ప్రత్యక్షంగా చూసినప్పటికీ ప్రతిపక్ష పార్టీల నాయకత్వం గాఢ నిద్రలోనే మగ్గిపోయిందని మోదీ పేర్కొన్నారు.

ప్రస్తుత బిహార్ ప్రభుత్వం ప్రతిపక్ష కూటముల విభజన ప్రచారాన్ని తిప్పికొడుతోందని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బిహార్ అమ్మాయిలు, అబ్బాయిలు రాష్ట్రంలోనే ఉపాధి పొందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. బిహార్ అంతటా ప్రధాన ప్రాజెక్టులు ప్రస్తుతం అభివృద్ధి జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా గయా జీ జిల్లాలోని దోభీ మారబోతుందని, గయా జీలో ఒక సాంకేతిక కేంద్రం కూడా ఏర్పాటు కాబోతుందని మోదీ తెలిపారు. నేడు బక్సర్ థర్మల్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం జరిగినట్లు ప్రస్తావించారు. కొన్ని నెలల క్రితం ఔరంగాబాద్‌లోని నబీనగర్ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తాను శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. భాగల్పూర్‌లోని పిర్పైంటిలో కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మిస్తామని తెలిపారు. ఈ విద్యుత్ ప్రాజెక్టులు బిహార్‌లో విద్యుత్ సరఫరాను గణనీయంగా పెంచేందుకు దోహదపడుతాయని తెలిపారు. విద్యుదుత్పత్తి పెరిగితే గృహాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని, ఫలితంగా ఇంధన మౌలిక సదుపాయాల విస్తరణ జరిగి కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పతాయని మోదీ పేర్కొన్నారు.

బిహార్ యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి శ్రీ నితీష్ కుమార్ భారీ ప్రచారాన్ని ప్రారంభించారని ప్రధానమంత్రి చెప్పారు. నితీష్ నాయకత్వం కారణంగా రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలు పూర్తి పారదర్శకంగా జరిగాయని ఆయన వ్యాఖ్యానించారు. బిహార్ లోని యువత రాష్ట్రంలోనే ఉపాధి పొందేలా కృషి జరుగుతోందని, ఉద్యోగాల కోసం వలస వెళ్ళాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పథకం ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు సహాయం చేస్తుందని తెలిపారు. తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రకటించినట్లు మోదీ చెప్పారు. ఈ పథకం కింద యువత ప్రైవేట్ రంగంలో మొదటిసారి ఉద్యోగంలో చేరినప్పుడు. కేంద్ర ప్రభుత్వం వారికి నేరుగా రూ.15, 000 అందజేస్తుందని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించే ప్రైవేట్ కంపెనీలు కూడా ఆర్థిక సహాయం పొందుతాయని ఆయన అన్నారు. అదేవిధంగా, యువతకు ఉపాధి కల్పించే ప్రైవేట్ కంపెనీలకు కూడా ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు.. ఈ పథకం బిహార్ యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

ప్రజాధనానికి ఎన్నడూ విలువనివ్వని ప్రతిపక్షాలను, వాటి ప్రభుత్వాలను శ్రీ మోదీ విమర్శిస్తూ, వారి దృష్టిలో ప్రజా నిధులంటే తమ సొంత ఖజానాను నింపుకొనే సాధనం అని విమర్శించారు. ప్రతిపక్ష పాలనలో, ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పూర్తి కాకుండా నిలిచిపోయాయని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఒక పథకం అమల్లో ఎంత జాప్యం జరిగితే, దాని నుంచి వారు అంత ఎక్కువగా సొమ్ము చేసుకున్నారన్నమాటేనన్నారు. ఈ తప్పుడు మనస్తత్వాన్ని తమ ప్రభుత్వం ఇప్పుడు మార్చివేసిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఒక పునాదిరాయిని వేస్తే, ఆ పనిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఉద్ఘాటించారు. ఈ విధానానికి ఈ రోజు చేపట్టిన కార్యక్రమమే ఒక ఉదాహరణ అని శ్రీ మోదీ అంటూ, ఆంటా-సిమరియా సెక్షనుకు తానే శంకుస్థాపన చేసి, ఇప్పుడు దీనిని ప్రారంభిస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ వంతెన రహదారులను కలపడం మాత్రమే కాదు.. ఉత్తర, దక్షిణ బిహార్‌లను కూడా జోడిస్తుందన్నారు. ఇంతకు ముందు గాంధీ సేతు మీదుగా 150 కి.మీ. చుట్టుదారిన ప్రయాణించక తప్పని భారీ వాహనాలకు ఇప్పుడు నేరు దోవ అందుబాటులోకి వచ్చిందని ఆయన వివరించారు. ఇది వాణిజ్యాన్ని పెంపొందించి, పరిశ్రమలను బలోపేతం చేసి, తీర్థయాత్రికులకు ప్రయాణాన్ని సులభతరం చేస్తుందని ప్రధాని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, ఇది తప్పక జరిగి తీరుతుందని ఆయన ఉద్ఘాటించారు.

బిహార్‌లో రైల్వేలను వేగంగా అభివృద్ధిచేయాలని కేంద్ర, రాష్ట్రాల్లోని తమ ప్రభుత్వాలు అదే పనిగా పెట్టుకున్నాయని ప్రధానమంత్రి తెలిపారు. గయా జీ రైల్వే స్టేషన్ ప్రయాణికులకు తాము విమానాశ్రయంలో ఉన్నామా! అనే అనుభూతిని కలగజేసేంతగా స్టేషన్‌ను 'అమృత్ భారత్ స్టేషన్ పథకం'లో భాగంగా ఆధునికీకరిస్తున్నామన్నారు. గయా నగరంలో ఇప్పుడు రాజధాని, జన్ శతాబ్ది రైళ్లతో పాటు భారత్‌లో తయారు చేసిన వందే భారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని శ్రీ మోదీ వెల్లడించారు. గయా జీ నుంచి సాసారామ్, ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ మీదుగా ఢిల్లీకి నేరు రైలు సంధాన సదుపాయం ఏర్పాటు బిహార్ యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కొత్త కొత్త అవకాశాల్ని కల్పిస్తోందని ఆయన ఉద్ఘాటించారు.

దేశ ప్రజల ఆశీస్సులు, అచంచల విశ్వాసాలు 2014లో ప్రధాని పదవిబాధ్యతలను తాను చేపట్టేటట్లు చేశాయని శ్రీ మోదీ చెబుతూ, అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆనాడు మొదలైన తన పదవీకాలం అంతరాయం లేకుండా సాగుతోందని, ఇన్నేళ్లలో తన ప్రభుత్వంపై ఒక్క అవినీతి మరకైనా పడలేదని ఆయన స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా, స్వాతంత్ర్యం సంపాదించుకున్న తరువాత ఆరు, ఆరున్నర దశాబ్దాలు పాలించిన విపక్ష ప్రభుత్వాలకు అవినీతి కేసుల చిట్టా చేంతాడంత ఉందని, విపక్షాల అవినీతి సంగతి బిహార్‌లో ప్రతి చిన్నారికి కూడా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. అవినీతిపై పోరాటాన్ని దాని తర్కబద్ధ ముగింపునకు తీసుకుపోవాలంటే, ఏ ఒక్కరూ చర్యల పరిధికి వెలుపల ఉండకూడదని ప్రధానమంత్రి సూటిగా చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం ప్రకారం, చివరికి ఒక జూనియర్ ప్రభుత్వ ఉద్యోగి అయినా కస్టడీలో 48 గంటల పాటు ఉంటే సస్పెన్షన్ దానంతట అదే వర్తిస్తుంది అని ప్రధాని గుర్తుచేశారు. ఒక ముఖ్యమంత్రి జైలులో ఉంటూ అధికార ప్రయోజనాల్ని పొందడం ఎలా సాధ్యం! అని ఆయన ప్రశ్నించారు. జైలులో ఉండి ఫైళ్లపై సంతకాలు పెట్టడం, అధికారిక ఉత్తర్వులు అక్కడి నుంచే నేరుగా జారీ చేసిన ఇటీవలి సంఘటనల్ని ప్రధాని ఉదహరించారు. రాజకీయ నేతల ధోరణి ఇలా ఉంటే, అప్పుడిక అవినీతికి వ్యతిరేకంగా పోరాటాన్ని సమర్థంగా ఎలా కొనసాగించగలం? అని శ్రీ మోదీ అన్నారు.

ప్రతి ప్రజాప్రతినిధి నిజాయతీగా ఉంటూ, పారదర్శకంగా నడుచుకోవాలని భారత రాజ్యాంగం ఆశిస్తోందని ప్రధానమంత్రి ప్రధానంగా చెప్పారు. రాజ్యాంగ గౌరవానికి ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం రానీయనేకూడదు అని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం కచ్చితమైన అవినీతి నిరోధక చట్టాన్ని తీసుకువస్తోందని, ఈ చట్టం దేశ ప్రధానికైనా సరే వర్తిస్తుందని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రులను, మంత్రులను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకువస్తారని ఆయన అన్నారు. దీనిని గురించి శ్రీ మోదీ మరింతగా వివరిస్తూ, ఈ చట్టం ఆచరణలోకి వస్తే, అరెస్టయిన ఏ ప్రధాని, ముఖ్యమంత్రి లేదా మంత్రి 30 రోజుల లోపల జామీను పొందాల్సిన అవసరం ఉంటుందన్నారు. బెయిలు మంజూరు కాకపోతే, వారు 31వ రోజున తమ పదవిని విడిచిపెట్టాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి తీవ్ర చట్టాన్ని తెచ్చే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఆయన స్పష్టం చేశారు.

ఈ బిల్లును వ్యతిరేకించినందుకు ప్రతిపక్షాలను శ్రీ మోదీ విమర్శిస్తూ, వారి కోపం భయం నుంచి పుట్టింది అని వ్యాఖ్యానించారు. తప్పు చేసిన వారు ఇతరుల నుంచి దాక్కోవచ్చు, కానీ తాము చేసిన పనులు ఏమిటన్నది వారికి తెలుసు అని ఆయన అన్నారు. ప్రతిపక్షాల్లోని కొందరు నేతలు జామీను మీద బయటకు వచ్చారు, ఇతరులు కుంభకోణాలకు సంబంధించిన న్యాయ విచారణల్లో చిక్కుకుపోయారు, మరి ఈ వ్యక్తుల భయమల్లా వారు గనక జైలుకు వెళ్తే, వారి రాజకీయ కలలు చెదిరిపోతాయనేదేనని ఆయన తెలిపారు. ఈ కారణంగానే వారు ప్రతిపాదిత చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని ఆయన చెప్పారు. అధికారం కోసం తపించే మనుషులు అవినీతికి పాల్పడి, జైలులో ఉన్న కాలంలోనూ పదవిని పట్టుకు వేళ్లాడుతారని రాజేంద్ర బాబు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి నేతలు ఎన్నడూ ఊహించి ఉండరని ప్రధాని అన్నారు. కొత్త చట్టం ప్రకారం, అవినీతిపరులు కటకటాల వెనక్కి వెళ్లడం ఒక్కటే కాకుండా తమ అధికార పదవులను కూడా కోల్పోతారని ఆయన స్పష్టం చేశారు. "అవినీతి నుంచి భారతదేశానికి విముక్తినివ్వాలనేది కోట్లాది పౌరుల ఉమ్మడి నిబద్ధత.. ఈ సంకల్పాన్ని నెరవేరుస్తాం" అని శ్రీ మోదీ తెలిపారు.

ఎర్ర కోట మీది నుంచి తాను ఒక గంభీర అంశాన్ని ప్రస్తావించిన సంగతిని శ్రీ మోదీ గుర్తు చేశారు. ఈ అంశం బిహార్‌పైన కూడా ప్రభావాన్ని ప్రసరిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో చొరబాటుదారుల సంఖ్య అంతకంతకు పెరిగిపోతూ ఉండడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆయన అన్నారు. బిహార్ సరిహద్దు జిల్లాల జనసంఖ్య సంబంధిత ముఖ చిత్రం వేగంగా మారిపోతోందని చెప్తూ, దేశ భవితను చొరబాటుదారులు నిర్ణయించేటట్లు చేయకూడదని తమ ప్రభుత్వం సంకల్పం చెప్పుకొందన్నారు. బిహార్ యువతకు దక్కాల్సిన ఉద్యోగావకాశాలను చొరబాటుదారులు లాగేసుకోనేందుకు అనుమతించబోమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. భారతీయ పౌరులకు ఉద్దేశించిన సదుపాయాలను చొరబాటుదారుల పాలు కాకుండా చూస్తామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ముప్పును పరిష్కరించడానికి, 'డెమోగ్రఫీ మిషన్'ను తీసుకువస్తున్నట్లు ప్రధాని ప్రకటించారు. ఈ మిషన్ కార్యకలాపాలు త్వరలోనే మొదలవుతాయన్నారు. ప్రతి చొరబాటుదారును దేశం నుంచి బహిష్కరించి తీరుతామని ఆయన అన్నారు. చొరబాటుదారులకు దేశం లోపల మద్దతిస్తున్న వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలని బిహార్ ప్రజలకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. బిహారీలను వారి హక్కులకు దూరం చేయాలని, ఆ హక్కులను చొరబాటుదారుల పరం చేయాలని ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని శ్రీ మోదీ తీవ్రంగా విమర్శించారు. బుజ్జగింపు రాజకీయాలు, ఓటు బ్యాంకు రాజకీయాలపై దృష్టి పెట్టి, ఆ పార్టీలు ఎంత వరకైనా వెళ్లడానికి సిద్ధమయ్యాయని ఆయన అన్నారు. బిహార్ ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

ప్రతిపక్షాల నష్టదాయక ఉద్దేశాల బారి నుంచి బిహార్‌ను రక్షించి తీరుతామని శ్రీ మోదీ ప్రధానంగా ప్రస్తావిస్తూ, ఇది బిహార్‌కు చాలా కీలక తరుణమని స్పష్టం చేశారు. రాష్ట్ర యువత కలలను నెరవేర్చుతామన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు కొత్త రెక్కలు తొడగాలి అని కూడా ఆయన అన్నారు. ఈ ఉద్దేశంతోనే శ్రీ నితీశ్ కుమార్‌తో కేంద్ర ప్రభుత్వం భుజం భుజం కలిపి పనిచేస్తోందని ప్రధాని ప్రధానంగా చెప్పారు. బిహార్‌లో అభివృద్ధి వేగాన్ని కొనసాగించడానికి కేంద్రంలోను, రాష్ట్రంలోను తమ ప్రభుత్వాలు నిరంతరం కష్టపడి పనిచేస్తున్నాయని, ఈనాడు చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులతో ఈ దిశలో ఒక ముఖ్యమైన ముందడుగును వేసినట్లు అయిందని చెప్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో బిహార్ గవర్నరు శ్రీ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, బిహార్ ముఖ్యమంత్రి శ్రీ నితీశ్ కుమార్, కేంద్ర మంత్రులు శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, శ్రీ జీతన్ రామ్ మాంఝీ, శ్రీ గిరిరాజ్ సింగ్, శ్రీ చిరాగ్ పాస్వాన్, శ్రీ నిత్యానంద్ రాయ్, శ్రీ రామ్ నాథ్ ఠాకూర్, డాక్టర్ రాజ్ భూషణ్ చౌదరి, శ్రీ సతీశ్ చంద్ర దుబే తో పాటు ఇతర ప్రముఖులు ఉన్నారు.

ప్రాంతాల మధ్య అనుసంధానం పెంచాలనే సంకల్పానికి అనుగుణంగా ప్రధాన మంత్రి, జాతీయ రహదారి-31పై 8.15కి.మీ. అంటా-సిమరియా వంతెనను ప్రారంభించారు. ఇందులో గంగా నదిపై 6 లైన్లతో కూడిన 1.86కి.మీ వంతెన కూడా ఉంది. ఈ ప్రాజెక్టును రూ.1,870 కోట్లకు పైగా వ్యయంతో చేపడుతున్నారు. ఇది పాట్నాలోని మోకమా, బెగుసరైని నేరుగా కలపనుంది.

ఈ వంతెనను పాత 2 లైన్ల రైలు-రోడ్డు వంతెన 'రాజేంద్ర సేతు'కు సమాంతరంగా నిర్మించారు. అది శిథిలావస్థకు చేరుకోవటంతో భారీ వాహనాలను దారి మళ్లించాల్సి వస్తుంది. ఈ కొత్త వంతెన ద్వారా ఉత్తర బిహార్(బెగుసరై, సుపాల్, మధుబని, పూర్ణియా, అరరియా మొదలైనవి) నుంచి దక్షిణ బీహార్ ప్రాంతాల(షేక్ పురా, నవదా, లక్ష్మిసరై)కు ప్రయాణించే భారీ వాహనాలకు 100కి.మీ పైగా అదనపు ప్రయాణ దూరం తగ్గుతుంది. వాహనాలు దారి మళ్లించుకోవాల్సి వచ్చినప్పుడు ఏర్పడే ట్రాఫిక్ జామ్ సమస్యను తగ్గించేందుకు ఈ వంతెన ఉపయోగపడుతుంది.

ఇది సమీప ప్రాంతాల ఆర్థిక వృద్ధికి సహకరిస్తుంది. ముఖ్యంగా ఉత్తర బిహార్‌కు ఉపయోగకరం. అవసరమైన ముడి సరుకు కోసం దక్షిణ బిహార్, జార్ఖండ్‌పై ఆధారపడే ఈ ప్రాంతాలకు ఇది ఎంతగానో తోడ్పడుతుంది. ఇది ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సిమరియా ధామ్‌కు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది ప్రఖ్యాత దివంగత కవి శ్రీ రామ్‌ధరి సింగ్ దిన్‌కర్ జన్మస్థలం కూడా.

ఎన్‌హెచ్-31లోని భక్తియార్‌పుర్ నుంచి మోకమా మధ్య నాలుగు లైన్ల రహదారి విభాగాన్ని కూడా ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును దాదాపు రూ.1,900 కోట్లతో చేపట్టారు. రద్దీని తగ్గించటం, ప్రయాణ సమయం కుదింపు, ప్రయాణికులు, సరుకు రవాణాను మెరుగుపరచటానికి ఇది సహకరిస్తుంది.






# కార్పొరేషన్ ఎన్నికల్లో ఖమ్మం మేయర్ సీటు ఎస్సీలకు కేటాయించాలి

**- ఖమ్మం కార్పొరేషన్ మేయర్ స్థానం రిజర్వేషన్ ఎస్సీ చేయాలి**
**- మాల మహానాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ దమళ్ల సత్యనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొప్పుల రామారావు**



ఖమ్మం, ఆగష్టు 23 (నేటినిజం ప్రతినిధి) :మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను కలిసి గత కొన్ని సంవత్సరాలుగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ వివిధ సామాజిక వర్గాలకు రిజర్వేషన్ కల్పించడం జరిగింది, కానీ ఇంతవరకు ఎస్సీలకు రిజర్వేషన్ మేయర్ కాలేదు, ఈసారి వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ స్థానం ఎస్సి సామాజికవర్గానికే కేటాయించాలని మాల మహానాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ దామల్ల సత్యనారాయణ కమిషనర్ ని కోరడం జరిగింది. దానికి కమిషనర్ స్పందిస్తూ ఎన్నికల కమిషన్ వారికి విన్నవిస్తామని చెప్పడం జరిగింది, తదనంతరం 52వ డివిజన్ స్థానిక సరిత క్లినిక్ గుట్టమీద నీటి సమస్య ఉన్నందువలన దాని పై కమిషనర్ కి సరిత క్లినిక్ గుట్టమీద సుమారు 150 కుటుంబాలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, వారు పనికి పోతేనే ఇల్లు గడుస్తుంది రెండు గంటలు నీళ్లకోసమే సమయాన్ని కేటాయించాల్సి వస్తుంది, కాబట్టి దీనిపై ఆలోచించి వెంటనే వారికి ఇంటింటికీ మిషన్ భగీరథ పైపు కనెక్షన్ ను ఇచ్చి నిరుపేద కుటుంబాలను ఈ ప్రభుత్వం ఆదుకోవాలని దీనిపై కమిషనర్ వెంటనే స్పందించి త్వరలో గుట్టమీద ఇంటింటికి పైపు కనెక్షన్లు ఇచ్చే ఏర్పాటు చేస్తానని వారు చెప్పడం జరిగింది, సరిత క్లినిక్ గుట్టపై మిషన్ భగీరథ నీటిని కనెక్షన్లు ఆ 150 కుటుంబాలకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారికి ఈ సందర్భంగా వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఇంచార్జ్ దామల్ల సత్యం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొప్పుల రామారావు, మాల మహానాడు అధ్యక్షులు దాసరి శ్రీను పాల్గొని వినతి పత్రం అందించడం జరిగింది.

# శాంతిభద్రతలు కాపాడాలంటూ.. చల్లూరులో పోలీసు కవాతు

కరీంనగర్, ఆగష్టు 23:వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో శనివారం ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, జెండా ఊపి కవాతు ప్రారంభించారు. కాగా సుమారు 60 మంది పోలీసులు గ్రామం శివారు నుండి గ్రామంలోని వీధుల గుండా తిరుగుతూ కవాతు చేశారు.

అనంతరం బస్టాండ్ కూడలి వద్ద జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కరీంనగర్ సీపీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు రానున్న గణేష్, దుర్గామాత నవరాత్రులు, స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని పోలీసు కవాతు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ టపీ భగీల్, జమ్మికుంట, ఇల్లందకుంట ఎస్సైలు నాగరాజు, క్రాంతి, మండల మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ యువకులు, నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో తన జయంతి సందర్భంగా మాజీ లోక్‌సభ స్పీకర్ డాక్టర్ బాల్ రామ్ జఖార్‌ను స్మరించుకున్నారు

న్యూఢిల్లీ, ఆగష్టు 23:లోక్‌సభ మాజీ స్పీకర్ డాక్టర్ బాల్ రామ్ జఖార్‌ను ఈరోజు ఆయన జయంతి సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో స్మరించుకున్నారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ శ్రీ హరివంశ్; పార్లమెంటు సభ్యులు; మాజీ సభ్యులు; మరియు లోక్‌సభ సెక్రటరీ జనరల్ శ్రీ ఉత్పల్ కుమార్ సింగ్ డాక్టర్ జఖార్‌కు నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా లోక్‌సభ మరియు రాజ్యసభ సెక్రటేరియట్‌ల సీనియర్ అధికారులు కూడా నివాళు లర్పించారు.

డాక్టర్ బాల్ రామ్ జక్కర్ 1980 జనవరి 22న ఏడవ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు మరియు 1985 జనవరి 15 వరకు కొనసాగారు. 1985 జనవరి 16న ఎనిమిదవ లోక్‌సభకు లోక్‌సభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు మరియు 1989 డిసెంబర్ 18 వరకు పూర్తి పదవీకాలం కొనసాగారు. స్వతంత్ర భారతదేశంలో వరుసగా రెండు లోక్‌సభలకు పూర్తి పదవీకాలం అధ్యక్షత వహించిన ఏకైక లోక్‌సభ స్పీకర్‌గా డాక్టర్ జక్కర్ ప్రత్యేకతను కలిగి ఉన్నారు. వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన డాక్టర్ జక్కర్ 1991 నుండి 1996 వరకు పదవ లోక్‌సభలో కేంద్ర వ్యవసాయ మంత్రిగా కూడా పనిచేశారు. డాక్టర్ జక్కర్ ఫిబ్రవరి 3, 2016న తుది శ్వాస విడిచారు.

డాక్టర్ బాల్ రామ్ జాఖర్ చిత్రపటాన్ని అప్పటి భారత రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ ఫిబ్రవరి 10, 2014న ఆవిష్కరించారు.

# అంతరిక్షంలో భారతదేశం సాధించిన పురోగతి ఇప్పుడు సాధారణ పౌరుల జీవితాలను సులభతరం చేయడంలో ప్రత్యక్షంగా దోహదపడుతోంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 23:జాతీయ అంతరిక్ష దినోత్సవం 2025 సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా, ఈ సంవత్సరం ఇతివృత్తమైన "ఆర్యభట్ట నుండి గగన్‌యాన్ వరకు" భారతదేశ గత విశ్వాసం మరియు దాని భవిష్యత్తు కోసం సంకల్పం రెండింటినీ ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తక్కువ సమయంలోనే, జాతీయ అంతరిక్ష దినోత్సవం భారతదేశ యువతకు ఉత్సాహం మరియు ఆకర్షణ యొక్క సందర్భంగా మారిందని, ఇది జాతీయ గర్వకారణమని ఆయన వ్యాఖ్యానించారు. శాస్త్రవేత్తలు మరియు యువతతో సహా అంతరిక్ష రంగంతో సంబంధం ఉన్న వారందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం ప్రస్తుతం అంతర్జాతీయ ఖగోళ శాస్త్రం మరియు ఖగోళ భౌతిక శాస్త్ర ఒలింపియాడ్‌ను నిర్వహిస్తోందని, అరవైకి పైగా దేశాల నుండి దాదాపు 300 మంది యువకులు పాల్గొంటున్నారని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భారతీయులు పతకాలు గెలుచుకున్నందుకు శ్రీ మోదీ సంతోషం వ్యక్తం చేశారు. అంతరిక్ష రంగంలో భారతదేశం యొక్క నూతన ప్రపంచ నాయకత్వానికి ఈ ఒలింపియాడ్ ఒక చిహ్నం అని ఆయన అన్నారు. యువతలో అంతరిక్షంపై ఆసక్తిని మరింతగా పెంచడానికి, ఇస్రో ఇండియన్ స్పేస్ హ్యాకథాన్ మరియు రోబోటిక్స్ ఛాలెంజ్ వంటి కార్యక్రమాలను ప్రారంభించడం పట్ల ప్రధానమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు మరియు విజేతలందరినీ ఆయన అభినందించారు.

''అంతరిక్ష రంగంలో మైలురాయిని అధిగమించడం భారతదేశం మరియు దాని శాస్త్రవేత్తల సహజ లక్షణంగా మారింది'' అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. రెండు సంవత్సరాల క్రితం భారతదేశం చంద్రుని దక్షిణ ధ్రువాన్ని చేరుకున్న మొదటి దేశంగా చరిత్ర సృష్టించిందని గుర్తుచేసుకుంటూ, అంతరిక్షంలో డాకింగ్-అన్‌డాకింగ్ సామర్థ్యాలను కలిగి ఉన్న ప్రపంచంలో భారతదేశం నాల్గవ దేశంగా అవతరించిందని ప్రధానమంత్రి హైలైట్ చేశారు. మూడు రోజుల క్రితం, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో జాతీయ జెండాను ఎగురవేసిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను తాను కలిశానని, ప్రతి భారతీయుడు గర్వంతో నిండిపోయాడని ఆయన పంచుకున్నారు. గ్రూప్ కెప్టెన్ శుక్లా తనకు త్రివర్ణ పతాకాన్ని చూపించినప్పుడు, దానిని తాకిన అనుభూతి మాటల్లో చెప్పలేనిదని ఆయన అన్నారు. గ్రూప్ కెప్టెన్ శుక్లాతో తన సంభాషణలో, నవ భారత యువత యొక్క అపరిమిత ధైర్యం మరియు అనంతమైన కలలను తాను చూశానని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ కలలను ముందుకు తీసుకెళ్లడానికి, భారతదేశం "వ్యోమగామి కొలను" సిద్ధం చేస్తోందని ప్రధానమంత్రి ప్రకటించారు. అంతరిక్ష దినోత్సవం నాడు, యువ పౌరులు ఈ కొలనులో చేరాలని మరియు భారతదేశ ఆకాంక్షలకు ఎగరడానికి సహాయం చేయాలని ఆయన ఆహ్వానించారు.

# 2040 లో చంద్రుని ఉపరితలం నుండి ఒక భారతీయుడు 'విక్షిత్ భారత్ 2047' ను ప్రకటిస్తాడు-డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 23:సైన్స్, కవిత్వం, వాస్తవికత మరియు భవిష్యత్తు వాగ్దానాలతో కూడిన ప్రసంగంలో, కేంద్ర సైన్స్ ఉ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు మాట్లాడుతూ, 2040లో చంద్రుని ఉపరితలం నుండి ఒక భారతీయుడు "విక్షిత్ భారత్ 2047"ను ప్రకటిస్తాడని మరియు ఇది భారతదేశం వచ్చిందనే సందేశాన్ని విశ్వం అంతటా పంపుతుందని అన్నారు.

భారత్ మండపంలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, భారతదేశ అంతరిక్ష కార్యక్రమం ప్రారంభం నుండే రాకెట్లు మరియు ఉపగ్రహాల కంటే ఎక్కువ - ఇది ప్రజల సాధికారత, జీవితాలను మెరుగుపరచడం మరియు మెరుగైన భవిష్యత్తును రూపొందించడం గురించి అని అన్నారు. 2015లో జరిగిన మొదటి మెగా యూజర్ మీట్ తర్వాత ఒక దశాబ్దం తర్వాత ఇటీవల ముగిసిన నేషనల్ మీట్ "జాతీయ అంతరిక్ష దినోత్సవం అనేది అంతరిక్షంలో భారతదేశం సాధించిన విజయాలు వాటికవే ముగింపు కాదని, విశాల దృక్పథానికి ఒక మెట్టు అని గుర్తుచేస్తుంది - ఇక్కడ సైన్స్, ఆవిష్కరణ మరియు ప్రజా సంక్షేమం కలిసి దేశ భవిష్యత్తును నిర్మించాయి" అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. గగన్‌యాన్ మిషన్‌కు సిద్ధమవుతున్న నలుగురు వ్యోమగాములు గ్రూప్ కెప్టెన్ సుభాన్షు శుక్లా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్ మరియు గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్‌లను సూచిస్తూ ఇస్రో భారతదేశానికి విలువైన ఆస్తిని సృష్టించిందని ఆయన అన్నారు.

2014లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించాలని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, 2015లో అంతరిక్ష అనువర్తనాలను ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలలో అనుసంధానించే దార్శనికతను నిర్దేశించినట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. "పది సంవత్సరాల తరువాత, ప్రభుత్వం మరియు ప్రైవేట్ రంగం రెండూ తమ అంతరిక్ష సామర్థ్యాలలో గణనీయంగా అభివృద్ధి చెందాయి" అని ఆయన అన్నారు. జాతీయ సమావేశం యొక్క రెండవ ఎడిషన్‌కు ముందు వినియోగదారు విభాగాలతో దాదాపు 300 పరస్పర చర్యలు జరిగాయని మరియు 5,000 పేజీలకు పైగా విస్తరించి ఉన్న 90 పత్రాలను రూపొందించామని, ఇది 15 సంవత్సరాల రోడ్‌మ్యాప్‌కు పునాదిగా నిలిచిందని ఆయన అన్నారు. ఈ ప్రణాళికలో 100 కంటే ఎక్కువ ఉపగ్రహాలను ప్రయోగించాలని, వాటిలో 70 శాతం చిన్న ఉపగ్రహాలను, ప్రభుత్వ సాంకేతిక మిషన్లు మరియు ప్రైవేట్ రంగం నేతృత్వంలోని కార్యాచరణ మిషన్ల మిశ్రమం ద్వారా అమలు చేయాలని యోచిస్తున్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రకారం, ఈ రోడ్‌మ్యాప్ 2040 మరియు అంతకు మించి భారతదేశ అంతరిక్ష ప్రయాణానికి మార్గనిర్దేశం చేస్తుంది, ఆహారం మరియు నీటి భద్రత, విపత్తు స్థితిస్థాపకత, పర్యావరణ స్థిరత్వం మరియు సమ్మిళిత వృద్ధి కోసం అంతరిక్ష సాంకేతికతను ఉపయోగించడం ద్వారా విక్షిత్ భారత్ దార్శనికతకు మద్దతు ఇస్తుంది.

# దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్ కుమార్ దీపక్

ఆదిలాబాద్, ఆగష్టు 23: దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సంబంధిత వైద్యులను ఆదేశించారు. శనివారం బెల్లంపల్లి వంద పడకల దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుష మహిళ వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

జ్వరపీడుతులకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. అన్ని రకాల రోగాలకు మందులను సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని వెల్లడించారు. వార్డులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు అందించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఆసుపత్రికి ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించి కిడ్నీ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన - నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ.




సంగారెడ్డి ఆగస్టు 23(నేటి నిజం ప్రతినిధి)మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా శనివారం సంగారెడ్డిలోని తార డిగ్రీ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి మాట్లాడుతూ "యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి. అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వ మిషన్ పరివర్తన' కార్యక్రమం జరుగుతోంది. ఎవరైనా మత్తు పదార్థాలను సేవిస్తుంటే లేదా విక్రయిస్తుంటే 14446 లేదా 1098 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించవచ్చు అని తెలిపారు. అలాగే బేటీ బచావో బేటీ పడావో వంటి కార్యక్రమాలు, యువతకు కౌన్సిలింగ్ కూడా జరుగుతోందని వివరించారు.

పట్టణ సీఐ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి. మత్తు పదార్థాలు వినియోగించడం, విక్రయించడం చట్టపరమైన నేరం. కఠిన కారాగార శిక్షలు తప్పవు అని హెచ్చరించారు. తదనంతరం అధికారులు మాదకద్రవ్యాల దుర్వినియోగంపై పోస్టర్లు ఆవిష్కరించారు. విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ప్రొహిబిషన్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, క్రైమ్ బ్రాంచ్ అధికారి రమేష్, తార డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, జిల్లా ఆరోగ్య, విద్య విస్తరణ అధికారి శ్రీనివాస్ రావు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# బుద్ధభవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి..



హన్మకొండ, ఆగష్టు 23: ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు కూడు, గూడు కల్పించాలని ఎన్నో పోరాటాలు చేసిన పోరాటయోధుడు తన పదునైన మాటలతో కార్యకర్తలకు, నాయకులను చైతన్యపరుస్తూ భారతదేశంలోనే ఒక మంచి వక్తగా గుర్తింపు పొందిన మహానాయకుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి అని కుమార్‌పల్లి బుద్ధభవన్ శాఖ సీనియర్ నాయకులు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ కుమార్‌పల్లి బుద్ధభవన్ శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. సురవరం సుధాకర్‌రెడ్డి కామ్రేడ్ బీఆర్ భవన్‌దాస్ ఆత్మీయతతో ఎన్నో కార్యక్రమాలకు బుద్ధభవన్ వేదికగా ప్రసంగించారు. ఇక్కడి ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో కుమార్‌పల్లి బుద్ధభవన్ శాఖ సీనియర్ నాయకులు కోడం రాజలింగం, జి.కృష్ణమూర్తి, యాళ్ల ప్రకాష్, బూజుగుండ్ల గిరిధర్, పీసరి లక్ష్మణ్, యాళ్ల సంజయ్, కునమల్ల శంకర్, ఒగ్గుల కన్నీ, సోటాల వినయ్, సోటాల మురళి, గొర్రె ప్రవీణ్ పాల్గొన్నారు.

# చిట్టి చేతులు...గట్టి సంకల్పం

**- స్మార్ట్ కిడ్జ్ లో ఆకట్టుకున్న ఎకో ఫ్రెండ్లీ గణనాథుల తయారీ**
**- మట్టి గణపయ్యలను తయారు చేసిన చిట్టి చేతులు**
**- చైతన్య పరిచిన ఎకో ఫ్రెండ్లీ అవగాహన ర్యాలీ**

ఖమ్మం ఆగస్టు 23 (నేటినిజం ప్రతినిధి) : స్థానిక స్మార్ట్ కిడ్జ పాఠశాలలో శనివారం పాఠశాల చిన్నారులు తమ చిట్టి చేతులతో ఎకో ఫ్రెండ్లీ గణనాధులను తయారు చేసి అందరికీ స్ఫూర్తినిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ఎకో ఫ్రెండ్లీ గణపయ్యాలనే పూజించాలని తెలియజేస్తూ చిన్నారులు ఉత్సాహంగా ఎకో ఫ్రెండ్లీ గణపతులను తయారు చేశారు. వివిధ రూపాలలో వినాయక ప్రతిమలను అందంగా రూపొందించారు. మట్టి గణపయ్యలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. పలు రకాల కూరగాయలతో, పండ్లతో, పూలతో, దినుసులతో, బియ్యం, బిస్కెట్స్, ఇడ్లీ, ఆకులు పలు రకాల ఆకృతులలో గణనాధులకు రూపం ఇచ్చారు. అనంతరం చిన్నారులు రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలతో నగరంలోని పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మట్టి గణపయ్యలనే పూజించాలని, పర్యావరణాన్ని రక్షించాలని, రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాలను పూజించకుండా పర్యావరణానికి రక్షణ కల్పించాలని కోరుతూ జరిపిన ర్యాలీ అందరిని విశేషంగా ఆకట్టుకుని చైతన్యపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ... భక్తులందరూ మట్టి వినాయకులతోనే గణేష్ వేడుకలను, పూజా కార్యక్రమాలను నిర్వహించాలని



కోరారు. పర్యావరణాన్ని, చెరువులను, నీటి వనరులను కాలుష్య రహితంగా ఉంచడానికి ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలకే పూజలు జరపాలని తెలియజేశారు. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా తమ పాఠశాలలో కాలుష్యరహిత పర్యావరణ రక్షణ కోసం ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలనే పూజించాలని అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులతోనే మట్టి గణపయ్యలు తయారు చేయడం జరిగిందని తెలిపారు. గణేష్ వేడుకలను పర్యావరణహితంగా, ఆధ్యాత్మికంగా, కాలుష్య రహితంగా ప్రజలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పలు సమస్యలపై బిజెపి బృందం మండల అధికారులకు వినతి పత్రం అందజేత



ఖమ్మం, ఆగష్టు 23:(నేటినిజం ప్రతినిధి): సింగరేణి మండల బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు మేకల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో బిజెపి బృందం శనివారం తాసిల్దార్, ఎండిఓల ను కలిసి మండలంలోని 41 గ్రామ పంచాయతీలలో ఉన్న సమస్యల గురించి, ఇందిరమ్మ ఇండ్ల సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు

. ఈ కార్యక్రమం లో మేకల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ...సింగరేణి మండలంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నా రని, గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ముఖ్యంగా వీధిలైట్ల సమస్య, దోమల నివారణ చర్యలు చేపట్టాలని, వర్షాలకు చిత్తడిగా మారిన గ్రామపంచాయతీలలో, గ్రామాలలో నిల్వ ఉంచిన నీటి తొట్లలో నీరు తొలగించి దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించి, చెత్తను తొలగించి నివారణ చర్యలు చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మట్టి తోలకాల వల్ల ట్రాక్టర్లు అధిక వేగంతో తోలడం వల్ల రోడ్లు గుంతలుగా మారి ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ట్రాక్టర్ల వల్ల గుంతలుగా మారిన రోడ్లను పూడ్చే విధంగా మరమ్మతులు జరిపించి నిజాయితీ గల సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేయాలని అన్నారు, గుంటలుగా మారిన రోడ్లను పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. రాష్ట్ర బిజెపి పార్టీ పిలుపుమేరకు జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు సూచన మేరకు శనివారం సాయంత్రం కారేపల్లిలో మండల అధ్యక్షులు మేకల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో పల్లె నిద్రలో భాగంగా పలు రైతు కుటుంబాలను కలిసి, వారి వ్యవసాయ స్థితిగతులు, యూరియా, మందుల కొరత గురించి అడిగి తెలుసుకున్న బిజెపి నాయకులు..ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, ప్రబారి మండేపూడి నాగేశ్వరరావు, కన్వీనర్ సుజాత, సీనియర్ నాయకులు తురక నారాయణ, రామ్మూర్తి, ఇస్లావత్ సురేష్, జ్యోతి, కోటి, సత్యవతి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# “అంతరిక్ష శాస్త్రం వ్యవసాయంలో అద్భుతమైన మార్పులను తీసుకువచ్చింది” - శ్రీ శివరాజ్ సింగ్




న్యూఢిల్లీ, ఆగష్టు 23:జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని పూసాలోని ఐసిఏఆర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయం ఒ రైతు సంక్షేమం మరియు గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ కార్యక్రమం యొక్క ఇతివృత్తం ‘వ్యవసాయ పరివర్తన కోసం అంతరిక్ష సాంకేతికతలో పరిశోధన మరియు అభివృద్ధి’. ఐసిఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్, సీనియర్ శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా పాల్గొన్నారు.

ఐసిఏఆర్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని కూడా జరుపుకోవడం చూడాలని తాను చాలా ఆసక్తిగా ఉన్నానని శ్రీ చౌహాన్ అన్నారు. “అంతరిక్ష శాస్త్రం ద్వారా, మేము భారతదేశంలో మరియు ప్రపంచంలో మార్పు తీసుకువస్తున్నాము. వ్యవసాయంలో సాంకేతికత మరియు శాస్త్రం ఎంత ముఖ్యమో మనందరికీ తెలుసు - మరియు మనం దానిని మరింత ముందుకు తీసుకెళ్లాలి” అని ఆయన అన్నారు.

శాస్త్రవేత్తలను “ఆధునిక ఋషులు” అని పిలుస్తూ, శ్రీ చౌహాన్ మాట్లాడుతూ, “మేము వ్యవసాయాన్ని, దాని దిశను మార్చాము మరియు రైతుల జీవితాలను మార్చాము. ప్రజలకు ఆహార భద్రతను నిర్ధారించాము. మేము రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తిని సాధించాము మరియు అంతరిక్ష శాస్త్రం సాటిలేని సహకారాన్ని అందించింది. పంట దిగుబడి అంచనా, పంట వ్యవస్థలు, గోధుమ, వరి, ఆవాలు, పత్తి, చెరకు ఉత్పత్తి, విస్తీర్ణం అంచనాలు, వాతావరణ సమాచారం వరకు - అంతరిక్ష అనువర్తనాలు ఇప్పుడు వ్యవసాయానికి కేంద్రంగా ఉన్నాయి - అంతరిక్ష సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుంది.”

గతంలో, వాతావరణ సూచనలు జానపద కథలు మరియు అంచనాలపై ఆధారపడి ఉండేవని, కానీ నేడు ఇస్రో యొక్క జియో పోర్టల్ వర్షపాతం, కరువు మరియు వాతావరణంపై దాదాపు ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తుందని ఆయన అన్నారు. “రైతులు ఇప్పుడు దీని ఆధారంగా తమ వ్యవసాయాన్ని ప్లాన్ చేసుకుంటారు. ఈ పోర్టల్ నేల తేమపై సమాచారాన్ని కూడా ఇస్తుంది, పంట ఆరోగ్య డేటాను ఏకీకృతం చేస్తుంది మరియు ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తుంది” అని ఆయన అన్నారు.

రైతులు అప్‌లోడ్ చేసిన ఫోటోల నుండి తెగుళ్లను గుర్తించడానికి మరియు నిజ-సమయ గోధుమ పర్యవేక్షణ, విత్తనాలు విత్తడం మరియు కొత విస్తీర్ణ అంచనా కోసం సాంకేతికతలు అభివృద్ధి చేయబడ్డాయని శ్రీ చౌహాన్ పేర్కొన్నారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాంకాలు ఇప్పుడు NRSC యొక్క CROP (ఫ్రేమ్‌వర్క్ (పంట పురోగతిపై సమగ్ర రిమోట్ సెన్సింగ్ పరిశీలన) తో సరిపోలుతున్నాయి. NASA-ISRO యొక్క NISAR మిషన్‌తో, నేల తేమ, పంట ఆరోగ్యం మరియు బయోమాస్ - చిన్న ప్లాట్ల నుండి పెద్ద భూముల వరకు - యొక్క ఖచ్చితమైన అంచనాలు సాధ్యమయ్యాయి.

గతంలో, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన గురించి ఆందోళనలలో లోపభూయిష్ట పంట కోత ప్రయోగాలు మరియు పారదర్శకత లేకపోవడం కూడా ఉన్నాయని ఆయన ఎత్తి చూపారు. “కొన్నిసార్లు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం లభించలేదు, అయితే ప్రభావితం కాని వారికి పరిహారం అందింది. కానీ ఉపగ్రహ ఆధారిత రిమోట్ సెన్సింగ్‌తో, పంట నష్టాన్ని ఇప్పుడు ఖచ్చితంగా అంచనా వేయవచ్చు, ఉపగ్రహ చిత్రాల ద్వారా సరైన పరిహారాన్ని పొందగలుగుతారు” అని ఆయన అన్నారు.

# జూలూరుపాడు మండలానికి సీతారామ ప్రాజెక్ట్ నీళ్లందించాలి : నెల్లూరు కోటేశ్వరరావు

ఖమ్మం, ఆగష్టు 23:జూలూరుపాడు మండలం వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ భూములకు సీతారాం ప్రాజెక్ట్ ద్వారా తక్షణమే కాల్వలు ఏర్పాటు చేసి నీళ్లు అందించాలని బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కొమరం భీం విగ్రహం నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీగా వెళ్లి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై తాసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతులకు నీళ్లు ఇవ్వకుండా వేరే ప్రాంతాలకి నీళ్ల తరలించడం అన్యాయం అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలోనూ కాంగ్రెస్ కార్యకర్తలకే ఇల్లు ఇవ్వడం సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు.

రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యానికి కప్పుపుచ్చుకోవడానికి యూరియా కొరతను కేంద్ర ప్రభుత్వంపై నెడుతుందన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనం అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. ఇకనైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీశ్, బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య రమేశ్, నున్న రమేశ్, దుదుకూరు కార్తీక్, మిశ్రా సిరుపరపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, అన్నవరపు సత్యనారాయణ, నిమ్మటూరి రామారావు, ధారావత్ బాలకిషన్, భూక్య రాంబాబు, చరణ్, రవి పాల్గొన్నారు.

# కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ దంపతుల సంస్మరణ సభ




హైదరాబాద్, ఆగష్టు 23:కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్, జయలక్ష్మి దంపతుల సంస్మరణ సభ శుక్రవారం సాయంత్రం శ్రీనగర్ కాలనీ శ్రీ సత్యసాయి నిగమాగమమ్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. వారి కుమారులు, కుమార్తె, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సభలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు “సంగీతం - విశ్వనాథ్ గారు” అనే అంశంపై ప్రధాన ప్రసంగం చేశారు. మానవులతో పాటు పశు పక్ష్యాదుల జీవితాలపై కూడా సంగీతం చూపే ప్రభావాన్ని సోదాహరణలతో వివరిస్తూ, విశ్వనాథ్ సంగీత-నృత్యకళల పట్ల చూపిన ఆసక్తి, వాటిని సినిమా మాధ్యమం ద్వారా పండిత పామరులకు అందించిన విధానాన్ని విశదీకరించారు. దాదాపు గంటపాటు సాగిన ఆయన ప్రసంగం శ్రోతలను తన్మయులను చేసింది. విశాలమైన సత్యసాయి ఆడిటోరియం విశ్వనాథ్ అభిమానులతో నిండిపోయింది.

సభలో వివిఎల్ సుబ్రహ్మణ్యం, జేడీ లక్ష్మీనారాయణ, తనికెళ్ల భరణి, పార్థసారథి తదితరులు పాల్గొని విశ్వనాథ్ దంపతుల జ్ఞాపకార్థం తమ గౌరవాన్ని చాటారు.

విశ్వనాథ్ సినిమాల్లో ఉపయోగించిన పాటలతో పాటు వేటూరి వంటి గేయరచయితల ప్రతిభను తెరపై చూపుతూ, దర్శకుని లోకాన్ని కొత్త కోణంలో పరిచయం చేశారు చాగంటి కోటేశ్వరరావు. ఎన్నోసార్లు విన్న పాటలకే ఆయన విశ్లేషణలు కొత్త కోణాలను ఆవిష్కరించాయి.. ఈ సందర్భంగా సభకు హాజరైన అభిమానులు ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. మన కాలంలో విశ్వనాథ్ ఉన్నందుకు, వారి ఉన్నత సంస్కారంతో రూపొందిన సినిమాలను చూసే భాగ్యం కలిగినందుకు తెలుగు ప్రజలు గర్వపడతారని సభలోని పలువురు పేర్కొన్నారు.

# 24 న వరంగల్ జరిగే బరి బహిరంగ సభను జయప్రదం చేయండి

## -సీపీఐ ( ఎమ్ ఎల్) సీపీ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు




హైదరాబాద్ ఆగస్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మావోయిస్టులను చంపాదని నిరసిస్తూ రేపు వరంగల్ జరిగే బరి బహిరంగ సభను జయప్రదం చేయాలని, సీపీఐ (ఎమ్ ఎల్) సీపీ పార్టీ జాతీయకార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు నిచ్చారు.వవ సంద్భ్ర్గుగా ఆయన మాట్లాడుతూ దేశంలోని టాటా, బిర్లా, అంబానీ, అదానీ,జిందాల్, ఎస్సార్ ,విదేశీ కార్పొరేట్ కంపెనీల ధన దోపిడి కోసం తరతరాలుగా అడివినీ నమ్ముకొని అడవిలోనే ఉంటున్న అడవి ప్రజలను కాందిశీకులుగా చేసి వారిపై మావోయిస్టులు అనే ముద్రవేసి సుదీర్ఘంగా జైలులో వేసి,ఆదివాసీ యువకులను మావోయిస్టు ముద్రలు వేసి బూటకపు ఎన్కౌంటర్ లో కాల్చి చంపడం, హిట్లర్ నజీహిజని పుణికి పుచ్చుకున్న కాషాయం ,ఆర్ఎస్ఎస్,మనువాద,బ్రాహ్మణీయ, బీజేపీ పార్టీ మోడీ,అమిత్ షా లకే చెందింది , అడివి నీ ,అందులో ఉన్న అపారమైన ముడి సరుకులను దోచుకునేందుకే ఆదివాసీలపై ( మావోయిస్టు) ల పేర్లతో ,సల్వాజుడం,ఆపరేషన్ గ్రీన్హంట్,ఆపరేషన్ సమాధాన్, ఈ ప్పుడు,ఆపరేషన్ కగార్ ( అంతిమ యుద్ధం) పేరుతో చంపినపుడు వందల మంది ఆదివాసీ బిడ్డలను చంపుతున్నారు, కార్పొరేట్ సంస్థలతో మోడీ,అమిత్ షా చేస్తున్న ఈ తాత్కాలిక ఆపరేషన్ లు త్వరలో అంతం కాక తప్ప దు, భూమి,భుక్తి, విముక్తి, జెల్,జంగిల్, ఈ జతు,పోరాటాలతో, బ్రిటీష్ వాడినే వణికించిన బీర్స్ ముండా వారసులు, అల్లూరి సీతారామరాజు మన్యం పులిబిడ్డ భూమి పుత్రులు, మీ కాగితనీ పిల్లలకు బయటపడే వారు కాదు ఈ భూమిపుత్రులు రేపు జరిగే వరంగల్ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మధ్యభారతంలో ఆదివాసీల హననా నికి వే తీరకంగా పోరాడుదాం,1996 పేసా చట్టం,2006 అటవీ హక్కుల చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేద్దాం, బస్తర్లో ఏర్పాటు చేసిన వందలాది కేంద్ర, రాష్ట్ర,సాయుధ పోలీసులు బలగాలను,క్యాంపులు ఎత్తి వేయాలని,,ఆపరేషన్ కగర్ ను నిలిపి వేయాలని,శాంతి చర్చలు కొనసాగించాలని,,ఎన్కౌంటర్ పేరుతో అణిచి వేస్తున్న ఆదివాసీలను జీవించే హక్కును రక్షించాలని,,కాల్పుల విరమణను ప్రకటించాలని ప్రభాకర్ డిమాండ్ చేసారు.

# రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటా మొత్తాన్ని పూర్తిగా సరఫరా చేయండి

## -ఆర్ఎఫ్సిఎల్ సీఈఓ తెలంగాణ ఎన్ఎఫ్సిఎల్ సేల్స్ మేనేజర్ లతో మంత్రి తుమ్మల సమావేశం

హైదరాబాద్ ఆగస్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆర్ఎఫ్సిఎల్ సీఈఓ అలోక్ సింగాల్ మరియు తెలంగాణ ఎన్ఎఫ్సిఎల్ సేల్స్ మేనేజర్, రాజేశ్ లతో సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి ఆర్ఎఫ్సిఎల్ నుండి రావలసిన యూరియా కోటాలో ఇంకా 62,473 మెట్రిక్ టన్నులు అందలేదని ఆర్ఎఫ్సిఎల్ ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి సరఫరా ఆలస్యమవ్వడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని మంత్రిగారు తెలిపారు. రైతుల పంటలపై ప్రతికూల ప్రభావం పడకముందే, రాష్ట్రానికి రావాల్సిన యూరియా సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు కోరారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటా మొత్తాన్ని పూర్తిగా సరఫరా చేయాలని మంత్రిగారు స్పష్టం చేశారు. ముందుగా కనీసం 50 శాతం యూరియాను ఈ వారంలోనే ఆర్ఎఫ్సిఎల్ నుండి గాని, ఎన్ఎఫ్సిఎల్ నుండి గాని రాష్ట్రానికి వంపేలా చూడాలని ఆయన సూచించారు. రైతులకు అసౌకర్యం కలగకుండా ఎరువుల పంపిణీ తక్షణమే జరగాలని మంత్రి స్పష్టం చేశారు. దీనికి స్పందించిన ఆర్ఎఫ్సిఎల్ ఎండి, రాష్ట్రానికి కావలసిన యూరియాను త్వరలోనే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల అవసరాలను తీర్చడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం 42 వేల మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందని, ఈ రోజు మరో 6543 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని మంత్రిగారు తెలిపారు. అలాగే ఈ నెల చివరి వరకు వివిధ తేదీలలో మరో 37,877 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని మంత్రిగారు అన్నారు. యూరియా సరఫరా కోసం ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా మంత్రిగారు పేర్కొన్నారు.

# బాల్యం నుండే భావి ఛాంపియన్లను గుర్తించాలి

## -పసిప్రాయం నుండే క్రీడా ఆసక్తి కలిగించాలి

## -జాతీయ క్రీడా ఉత్సవాలను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్ ఆగస్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పసిప్రాయం నుండే పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖమంత్రి వాటికి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి తొమ్మిది రోజులపాటు జరిగే జాతీయ క్రీడ ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చిన్ననాటి నుండే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించడం వారిని మైదానాల వైపు ప్రోత్సహించడం కుటుంబాలకు మాత్రమే కాకుండా దేశానికి సమాజానికి ఎంతో శ్రేయస్కరమని ఆయన అన్నారు మొక్కై వంగనిది మానై వంగదు అనే సామెత మాదిరిగా పసిప్రాయం నుండే క్రీడల్లో పట్ల శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడల్లో విజయాలు సాధించడమే కాకుండా ఆరోగ్యవంతులుగాతీర్చిదిద్దబడతారని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గారి సహకారంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో దేశంలో ఏ రాష్ట్రము నిర్వహించనంత ఘనంగా జాతీయ క్రీడ ఉత్సవాలను నిర్వహించబోతున్నామని, జాతీయ క్రీడా దినోత్సవం అని ఒక్క రోజుకే పరిమితం చేయకుండా తొమ్మిది రోజుల పాటు వివిధ వర్గాలను క్రీడల్లో భాగస్వామ్యం చేసే విధంగా అన్ని వయసుల వారికి వర్గాల వారికి వినూత్న కార్యక్రమాలు రూపొందించామని ఆయన అన్నారు. కేవలం హైదరాబాద్ నగరానికే కాకుండా జిల్లా కేంద్రాల్లో వివిధ విద్యాసంస్థల్లో ఈ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి రవీందర్ అనిత పి ఆర్ ఓ కాలేరు సురేష్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ మధు ఫ్యూచర్ ఒలంపియన్ నిర్వాహకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేట మున్సిపల్ కమిషనర్ ను సన్మానించిన- న్యాయవాది కోవూరి



సదాశివపేట ఆగస్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన టి శివాజీకి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాది సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ సదాశివపేట పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని అదేవిధంగా గతంలో మున్సిపల్ కమిషనర్లుగా పనిచేసిన వాళ్ళు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వారి యొక్క బాధ్యతలు నెరవేర్చడంలో ఎంతో బాధ్యతగా వ్యవహరించడం ఆనందదాయకంగా ఉండేనని కొనియాడుతూ ఈ ప్రజాక్షేత్రంలో ప్రజలకు సేవ చేసుకోవడమే , పట్టణ అభివృద్ధి కోరడమే కాంగ్రెస్ పార్టీ నాయకుల లక్ష్యమని తెలిపారు.

# కాంగ్రెస్ కు, ఆర్జేడికి ఒక ఎజెండా అంటూ ఏమీ లేదు

## -కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఏం మాట్లాడుతున్నరో ఆయనకే తెలియదు

## -ఇల్లీగల్ ఓట్లు దేశవ్యాప్తంగా ఉన్న సమస్యనే..

## -మీడియాతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చిట్ చాట్

హైదరాబాద్ ఆగష్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్జేడికి ఒక ఎజెండా అంటూ ఏమీ లేదని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బిహార్ ఎన్నికల్లో మంచి వాతావరణం ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఏం మాట్లాడుతున్నరో ఆయనకే తెలియదని విమర్శించారు. ఇల్లీగల్ ఓట్లు దేశవ్యాప్తంగా ఉన్న సమస్యనే.. బిహార్ లో ఇల్లీగల్ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, తెలియజేశారు. హిమాచల్, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని, దొంగఓట్లతోనేనా అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. తీవ్రమైన నేరాల్లో ఉన్న సిఎం, మంత్రులు రాజీనామా చేయాల్సిందేనని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అంశాన్ని సీరియస్ గా తీసుకున్నామని, కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ దర్యాప్తు జరగాల్సిందేనని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం లేఖ రాసిందని, ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉంది అని కిషన్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు.

# యూరియా కొరతపై రాజకీయం చేయకుండా రైతులకు అందించే ప్రయత్నం చేయండి

## -డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలన్నింటిని రెండు నెలల్లో పరిష్కరించాలి

## - తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో బిజెపి ఎంపీల సహకారం ఎప్పటికీ ఉంటుంది

## -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో భేటీ అయి మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్

హైదరాబాద్ ఆగష్టు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భారతీయ జనతా పార్టీ ఎంపీల సహకారం ఎప్పటికీ ఉంటుందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ తెలిపారు. ఈమేరకు శనివారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో భేటీ అయి మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పలు వినతి పత్రాలు మంత్రికి అందజేశారు. అనంతరం ఈటెల మీడియా తో మాట్లాడుతూ యూరియా కొరతపై రాజకీయం చేయకుండా రైతులకు అందించే ప్రయత్నం చేయండి. బాధ్యతగా వ్యవహరించండని చూసించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలన్నింటిని రెండు నెలల్లో పరిష్కరించాలని డిమాండ్ చేసారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు విసిరి వేసినట్టు ఎక్కడో దూరంగా ఉన్నాయి. కేటాయింపులు సరిగా జరగలేదు. కరెంటు సౌకర్యం, రోడ్ల సౌకర్యం, డ్రైనేజీలు, లిఫ్టు సరిగా లేవు. ఈ సమస్యలు పరిష్కారం కాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాస ఉండటం కష్టంగా ఉంది. రెండు నెలల్లో పరిష్కారం చూపించాలని కోరడం జరిగింది. ఎవరికైతే కేటాయించారో వారిని మాత్రమే ఉండేలా చూడాలి. కొత్తగా ఇల్లు కేటాయింపులో స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోలేదు. నిజంగా పేదరికంలో ఉండి భూమి ఉండి ఇల్లు లేని వాళ్ళకి ఇల్లు ఇవ్వాలి. కొన్ని చోట్ల ఇవ్వలేదు ఆ లిస్టు కూడా ఈరోజు మంత్రి గారికి ఇచ్చాను. ఇల్లు లేని వారికి పేదవారికి మాత్రమే ఇల్లు ఇవ్వాలి తప్ప పైరవీలకు చోటివ్వవద్దని కోరాను. పారదర్శకత పాటించాలని కోరామని తెలిపారు..బస్తీలలో నివసించే వారికి అక్కడే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టిస్తే వారికి జీవనోపాధి సమస్య ఉండదు. కూరగాయులు, పండ్లు అమ్ముకునేవారు, ఇళ్లల్లో పనిచేసే బ్రతికే వారికి అక్కడే ఇల్లు కట్టిస్తే లైవ్లీహుడ్ దెబ్బతినకుండా ఉంటుందనీ కోరాను, దీనికి మంత్రిగారు సుముకత వ్యక్తం చేశారు. హుజురాబాద్ నియోజకవర్గం లో కట్టిన ఇళ్లను కేటాయించకపోవడం వల్ల దర్వాజాలు కిటికీలు పీక్కుని పోతున్నారు.. కావాల్సిన మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించి పేదవారికి ఇళ్లను కేటాయించాలని కోరాను. సిమెంట్ ధర, ఇనుము ధర, ఇసుక ధర, మేస్త్రీల ధర పెరిగింది ఐదు లక్షల రూపాయల్లో ఇల్లు కట్టడం సాధ్యం కాదు. కొన్ని నిబంధనలు సడలించి ఇల్లు కట్టుకునే వారికి సాయం అందించాలి. జవహర్ నగర్ భూములకు ప్రభుత్వానికి సంబంధం లేదు. అవి ఆర్మీ భూములు. డంపు యార్డ్ వాసన పక్కన భూములు కొనుక్కొని ఇల్లు కట్టుకునే వారు అందరూ పేదవారే, కానీ రెండు మూడు లక్షల రూపాయల లంచం ఇస్తే తప్ప ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదు. రెవెన్యూ అధికారులు, బ్రోకర్లు కలిసి ఇబ్బందులు పెడుతున్నారు. ఇల్లు కూలగొట్టిస్తున్నారు. దీని మీద సమగ్రమైన విచారణ జరిపించాలని పేదవాళ్లు కట్టుకునే ఇళ్లకు ఇబ్బంది పెట్టొద్దని మంత్రి దృష్టికి తీసుకువచ్చాము. మల్కాజిగిరి జిల్లా ఆఖీఅ మీటింగ్ సంవత్సరంనర అయినా జరగలేదు వెంటనే నిర్వహించాలని శ్రీధర్ బాబు గారిని కోరుతున్నామన్నారు. నాలుగు లక్షల మెజారిటీతో నన్ను గెలిపించారు కాబట్టి బాధ్యతగా వారికోసం కష్టపడుతున్నాను. ప్రభుత్వం ఏదున్న ప్రజల సమస్యలను తీర్చాలి. ప్రజా సమస్యల పరిష్కారం జరిగే వరకు నా ప్రయత్నం కొనసాగుతుంది. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టే నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తప్ప కేంద్ర ప్రభుత్వాన్ని కాదు. వారు ఇన్ని ఇల్లు అని కేటాయిస్తారు తప్ప.. నిబంధనలు చూసుకోవాల్సింది రాష్ట్రమే. ఒకవేళ కఠిన నిబంధనలు ఉంటే రిలాక్స్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కూడా విజ్ఞప్తి చేస్తాము. ఎక్కువ ఇల్లు రాష్ట్రానికి రావాలనేది మా ఎంపీల కోరిక ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భారతీయ జనతా పార్టీ ఎంపీల సహకారం ఎప్పటికీ ఉంటుంది.నేషన్ హైవేలు, రైల్వే పనుల కోసం మేమే కేంద్రమంత్రులను కలిసి వినతిపత్రాలు అందిస్తున్నాము.

యూరియా కొరత :

రాష్ట్ర ప్రభుత్వాలు అవసరాల మేరకు ఇండెంట్ పెట్టుకొని స్టాక్ తెప్పించి ముందుగానే నిల్వ ఏర్పాటు చేసుకుంటారు.తెలంగాణలో ఎక్కడ ప్లాన్ కొరవడిందో తెలవదు. బాధ్యతగా వ్యవహరించాలి తప్ప కేంద్రం మీద నెపం నెట్టవద్దు.రాజకీయాల కంటే కూడా రైతులకు ఎలా యూరియా అందించాలి అనే ఆలోచన చేయాలి. వేరే వారి మీద నెట్టడం మంచిది కాదు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉంది అనేది మన ప్రధాని నరేంద్ర మోడీ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతము. రైతుబంధు, నేషనల్ హైవేలు, ఫ్లైఓవర్లు ఇతర రాష్ట్రాలతో పాటుగా మనకు కూడా వస్తున్నాయి. మాది సంకుచితంగా వ్యవహరించే ప్రభుత్వం కాదు. వైస్ ప్రెసిడెంట్ కు ఓటు వేయమని ముఖ్యమంత్రి అందరినీ కోరడం చేయడం సహజం. కానీ నేను భారతీయ జనతా పార్టీ ఎంపీని అని అన్నారు.

# మోదీ కానుకగా సైకిళ్ల పంపిణీ



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 23:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో ప్రభుత్వ కళాశాల మైదానంలో ఆగస్ట్ 26 మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదినం పురస్కరించుకుని మోడీ కానుకగా సైకిళ్ల పంపిణి కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని భారతీయ జనతా పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం భీమేశ్వర గార్డెన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ హిందూ జన బాంధవుడు బండి సంజయ్ గొప్ప ఆలోచనతో పదో తరగతి పిల్లలకు తన పార్లమెంటు పరిధిలోని దాదాపు 20వేల సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించి వేములవాడ నియోజకవర్గంలో దాదాపు 2000 వేల సైకిళ్ళు పంపిణీ కార్యక్రమం బండి సంజయ్ చేతుల మీదుగా ప్రారంభం చేసుకుని అన్ని గ్రామాల పదవ తరగతి పిల్లలకు అందించేలా కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ స్వామి, గుంటి కనకయ్య, బోనాల శివ, గడ్డమీద శ్రీను, పిన్నింటి హనుమన్లు, మైలారనీ శ్రీను, కట్కం శ్రీనివాస్, అన్నం నరసయ్య, గుడిసె మనోజ్, మల్లేశం యాదవ్, మెరుగు లక్ష్మన్, వెంకన్న రాహుల్, బాబు,రఘుపతి, రేగుల శ్రీకాంత్, శంకర్, దన్ను, సాయి, పరశురాం, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 23:(నేటినిజం ప్రతినిధి): శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి అన్నపూర్ణ నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి రాజేందర్ సత్రం దాత అనంతుల సాంబమూర్తి వరంగల్ కుటుంబ సభ్యులు సత్రం గౌరవ అధ్యక్షులు కూతురు, అల్లుడు కొల్లేటి ఫణీష్, నిఖిత దంపతులు సత్రం,వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ వాణి పవన్ కుమార్ దంపతులు పాల్గొని, ఆశీర్వచనం పొందారు. కార్యక్రమం అనంతరం గుడి ముందు పేదలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కు చెందిన సత్రం నిత్యాన దాతసాంబమూర్తి, వారి కుమారుడు సురేష్ లను సత్ర వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ పవన్ కుమార్ గశాలువాతో సన్మానించారు. ప్రతి నెల నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న సత్రం దాతలకు శ్రేయోభిలాషులకు, మిత్రులకు ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

